బుధవారం, సెప్టెంబర్ 16, 2026
తెలంగాణ
సంపుటి :16 (Vallume :16) | సంచిక : 104 (Issue :104) | పేజీలు : 08 (Pages 08) | వెల : రూ. 5.00/- (Rs : 5.00/-)
Published from : Kurnool | Vijayawada | Hyderabad
PRGI No. APTEL/2010/31893

# కొత్త స్వరం

KOTHASWARAM
తెలుగు దినపత్రిక
www.kothaswaram.com

కొత్త స్వరం దినపత్రిక
తెలుగు దినపత్రికకు
విలేకరులు కావలెను
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి ఉత్సాహవంతులైన విలేకరులు కావలెను.
సంప్రదించండి:
ఆంధ్ర ప్రదేశ్: 9492813364
తెలంగాణ: 9848095151

# ఆగా ఖాన్ ఫౌండేషన్‌తో మరింత సహకారం

## ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్‌తో సీఎం భేటీ

తెలంగాణ వారసత్వ సంపద పరిరక్షణపై చర్చ
మూసీ పునరుజ్జీవన ప్రణాళికలను వివరించిన సీఎం
ఫ్యూచర్ సిటీపై ప్రిన్స్ ఆగా ఖాన్ ఆసక్తి
ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్‌కు ఆహ్వానం



**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (కొత్త స్వరం) :** భారత పర్యటనలో ఉన్న ఆగా ఖాన్ ఫౌండేషన్ చైర్మన్ హిజ్ హైనెస్ ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-ఎ హైదరాబాద్ వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి వారితో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో జరిగిన ఈ భేటీలో తెలంగాణలో ఆగా ఖాన్ ఫౌండేషన్ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఆగా ఖాన్ ఫౌండేషన్‌పై తమకు అత్యంత గౌరవం ఉందని పేర్కొంటూ హైదరాబాద్‌తో ఆగా ఖాన్ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ వారసత్వ సంపద పునరుద్ధరణలో ఫౌండేషన్ కీలక పాత్ర పోషిస్తోందని, ఫౌండేషన్ సహకారంతో ఇటీవల శాసనమండలి భవనాన్ని, నగరంలోని కుతుబ్ షాహీ టూంబ్స్‌ను పునరుద్ధరించిన విషయాన్ని తెలిపారు. హైదరాబాద్ నగర పునర్నిర్మాణంలో భాగంగా చేపడుతున్న మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు ప్రణాళికలను వివరించిన సీఎం, మూసీ నది వెంట నైట్ ఎకానమీ ▶ (మిగతా 2వ పేజీలో..)

## పోలీస్ స్టేషన్‌లోనే దాడి జరగడం దారుణం

కేసీఆర్ నివాసంపై దాడిని ఖండించిన నేత
దాడిని అడ్డుకునేందుకు వెళ్తే నిర్బంధించారని ఆరోపణ
పీఏ, పీఆర్వోలపై పోలీస్ స్టేషన్‌లోనే దాడి జరిగిందని వెల్లడి
ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని ఆరోపణ
న్యాయస్థానాన్ని ఆశ్రయించి పోరాడతామని ప్రకటన 2





## జిన్‌పింగ్‌తో భేటీలో భారత్ ఆందోళనలు ప్రస్తావించిన మోదీ

మోదీ-జిన్‌పింగ్ మధ్య ద్వైపాక్షిక చర్చలు
పరస్పర గౌరవం, ప్రయోజనం, సున్నితత్వం అవసరమని స్పష్టీకరణ
భారత్ ఆందోళనలను జిన్‌పింగ్ దృష్టికి తీసుకెళ్లిన ప్రధాని
సరిహద్దుల్లో శాంతి, సుస్థిరతపై చర్చ
భాగస్వామ్య సంబంధాల కొనసాగింపుపై చైనా ప్రకటన 2

## పోలీసుల ఎదుట విచారణకు హాజరైన యూట్యూబర్ నందన

గడువుకు ఒకరోజు ముందే విచారణకు హాజరు 6



## 22ఏ భూముల సమస్యపై రఘునందన్ రావు ఆందోళన

లక్షలాది మంది రిజిస్ట్రేషన్లకు ఇబ్బందులు పడుతున్నారన్న ఎంపీ
మంత్రి పొంగులేటి సమాధానంపై విమర్శలు
47,440 ఎకరాల తొలగింపు వివరాలు వెల్లడించాలని డిమాండ్
22ఏ భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలని విజ్ఞప్తి
ధరణి, భూభారతి సమస్యలపై ప్రత్యేక కమిటీకి డిమాండ్ 2

## కొత్త స్వరం దిన పత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

ప్రజా సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తేవాలి
మీడియా కీలక పాత్ర పోషించాలి
బీసీ వర్గాల ఆకాంక్షలకు ప్రాధాన్యత ఇవ్వాలి
సామాజిక న్యాయానికి పెద్దపీట వేయాలి



**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (కొత్త స్వరం):** హైదరాబాద్‌లోని తెలంగాణ రాజ్యాధికార పార్టీ కేంద్ర కార్యాలయంలో "కొత్త స్వరం" వార్త దినపత్రికను పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న గారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పత్రిక సంపాదక వర్గాన్ని ఆయన అభినందిస్తూ, సమాజంలోని ప్రజా సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకురావడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని అన్నారు. ప్రజల గొంతుకగా నిలుస్తూ సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాలపై నిష్పాక్షికంగా వార్తలను అందించే వేదికగా "కొత్త స్వరం" పత్రిక ఎదగాలని ఆకాంక్షించారు. ప్రజల సమస్యలు, బీసీ వర్గాల ఆకాంక్షలు, సామాజిక న్యాయం వంటి అంశాలకు పత్రికలో ప్రాధాన్యత కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల ప్రవీణ్ రాజ్, నగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు అంజి, పార్టీ నాయకులు, పత్రిక ప్రతినిధులు పాల్గొన్నారు.

## కొండా సురేఖ తొలగింపు బాధాకరం: మహేశ్‌కుమార్ గౌడ్





పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనతోనే ఏఐసీసీ చర్య
పార్టీ హద్దులు దాటితే చర్యలు తప్పవని స్పష్టీకరణ
సీఎం రేవంత్‌రెడ్డితో విభేదాలు లేవన్న టీపీసీసీ చీఫ్
పార్టీ, ప్రభుత్వాన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళ్తున్నామని వెల్లడి
అంతర్గత సమస్యలను పార్టీ వేదికలపైనే చర్చించాలని సూచన 5



## మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని హఠాన్మరణం

గుండెపోటుతో విశాఖలో కన్నుమూసిన ఆళ్ల నాని
56 ఏళ్ల వయసులోనే ఆకస్మిక మృతి
మూడుసార్లు ఏలూరు ఎమ్మెల్యేగా సేవలు
డిప్యూటీ సీఎంగా, వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు
నాని మృతిపై రాజకీయ నేతల సంతాపం 6

# 2029 నాటికి.. అర్హులందరికీ పక్కా ఇళ్లు

మార్చి 2027 నాటికి 5.52 లక్షల ఇళ్ల పూర్తి
వచ్చే నెలలోనే ఇళ్ల నిర్మాణాలకు గ్రౌండింగ్
పట్టణ ప్రాంతాల్లో 1.50 లక్షల ఇళ్ల నిర్మాణం
ఉచిత ఇళ్ల స్థలాలపై ప్రత్యేక దృష్టి
కేంద్ర సహకారంతో పారిశ్రామిక టౌన్‌షిప్‌లు



**అమరావతి, సెప్టెంబర్ 15 (కొత్త స్వరం) :** రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికి 2029 నాటికి సురక్షితమైన, శాశ్వత గృహాన్ని అందించాలనే లక్ష్యంతో హౌసింగ్ ఫర్ ఆల్ కార్యక్రమాన్ని సంతృప్తికర స్థాయిలో అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. క్యాంపు కార్యాలయంలో హౌసింగ్ శాఖపై నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. మార్చి ▶ (మిగతా 2వ పేజీలో..)

## ఫోటో ఓటర్ల జాబితా విడుదలకు ఏర్పాట్లు

12 నగర పాలక సంస్థల్లో జాబితా తయారీ
29 పురపాలక సంఘాల్లో వార్డుల వారీగా ఓటర్ల జాబితా
నగర పంచాయతీల్లోనూ ప్రక్రియ..
వార్డుల వారీగా ఫోటో ఓటర్ల జాబితా
ఈ నెల 22న జాబితా విడుదల



**విజయవాడ, సెప్టెంబర్ 15 (కొత్త స్వరం) :** రాష్ట్రంలోని 12 నగర పాలక సంస్థలు, 29 పురపాలక సంఘాలు, నగర పంచాయతీలలో వార్డుల వారీగా ఫోటో ఓటర్ల జాబితా తయారీ, ప్రచురణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. ఈ ప్రక్రియలో భాగంగా వార్డుల వారీగా ఫోటో ఓటర్ల జాబితాలను సిద్ధం చేసి ఈ నెల 22న విడుదల చేయనున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది.

## తెలుగు రాష్ట్రాలకు మరో 5 లక్షల ఇళ్లు

పీఎంఏవై కింద అదనపు ఇళ్ల మంజూరు
ఏపీకి 3 లక్షలు.. తెలంగాణకు 2 లక్షలు
ఇళ్లు లేని పేద కుటుంబాలకు ప్రయోజనం
గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అర్హులకు అవకాశం
త్వరలో జిల్లాల వారీగా లబ్ధిదారుల ఎంపిక



# కొత్త స్వరం దినపత్రికకు అభినందనలు





పత్రికను ఆవిష్కరించిన ప్రముఖులు
డాక్టర్ హరిప్రసాద్ కంచర్ల చేతుల మీదుగా ఆవిష్కరణ
అడ్వకేట్ బి. బాలచంద్రుడు అభినందనలు
హైకోర్టు అడ్వకేట్ వై. జయరాజు శుభాకాంక్షలు
ప్రజలకు-ప్రభుత్వానికి వారధిగా నిలవాలి
విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్ష

**కర్నూలు, సెప్టెంబర్ 15 (కొత్త స్వరం):** కొత్త స్వరం దినపత్రికను సంఘమిత్ర పాలీ క్లినిక్ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ హరిప్రసాద్ కంచర్ల, అడ్వకేట్ బి. బాలచంద్రుడు, హైకోర్టు అడ్వకేట్ వై. జయరాజు మంగళవారం కర్నూలులోని తమ తమ కార్యాలయాల్లో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొత్త స్వరం దినపత్రిక ప్రతులను ఆవిష్కరించి పత్రిక యాజమాన్యానికి, సంపాదక వర్గానికి అభినందనలు తెలిపారు. నూతనంగా ప్రారంభమైన కొత్త స్వరం దినపత్రిక ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు సమాజంలో జరుగుతున్న వివిధ అంశాలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ప్రజల సమస్యలు, సామాజిక అంశాలు, విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు తదితర అంశాలకు పత్రికలో సముచిత ప్రాధాన్యత కల్పిస్తూ ప్రజల గొంతుకగా నిలవాలని వారు పేర్కొన్నారు. ప్రజలకు-ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకువచ్చే విధంగా పత్రిక తన ప్రత్యేకతను చాటుకోవాలని ఆకాంక్షించారు. నేటి సమాజంలో పత్రికా రంగం ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన పాత్ర పోషిస్తోందని, ప్రజా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో మీడియా బాధ్యత ఎంతో ముఖ్యమని తెలిపారు. సమాజంలో చోటుచేసుకునే మంచి విషయాలను ప్రోత్సహించడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను వెలుగులోకి తీసుకురావడం ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు. కొత్త స్వరం దినపత్రిక నిష్పక్షపాతంగా, ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగాలని వారు ఆకాంక్షించారు. పత్రిక ప్రారంభం సందర్భంగా యాజమాన్యాన్ని అభినందిస్తూ భవిష్యత్తులో మరింత విజయవంతంగా కొనసాగాలని, పాఠకుల ఆదరణ పొందాలని శుభాకాంక్షలు తెలిపారు. కొత్త స్వరం దినపత్రిక అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని కోరుతూ ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ సందర్భంగా పత్రిక ప్రతినిధులు ప్రముఖులకు కృతజ్ఞతలు తెలిపారు.





## ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు గడువు పొడిగింపు

సెప్టెంబర్ 18 వరకు దరఖాస్తులకు అవకాశం
అర్హులందరికీ అవకాశం కల్పించేందుకే నిర్ణయం
వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలి
స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల్లో దరఖాస్తుల స్వీకరణ
రాష్ట్రంలో 62 లక్షల మందికి పింఛన్లు 5

# కళాకారులకు కులంతో.. సంబంధం లేదు

అర్హులైన కళాకారులు పెన్షన్‌కు దరఖాస్తు చేసుకోవాలి

**ఒకే కులానికే పెన్షన్ అన్న అపోహ వద్దు**

**అన్ని కులాల్లో డప్పు కళాకారులు ఉన్నారు**

**చర్మ కళాకారులూ పెన్షన్‌కు అర్హులే**

**సచివాలయంలో అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించాలి**

**ప్రకాశం, సెప్టెంబర్ 15 (కొత్త స్వరం):**

కళాకారులకు ఇచ్చే పెన్షన్ స్కీమ్ కేవలం ఒకే కులానికి మాత్రమే వర్తిస్తుందన్న అపోహను తొలగించాలని రాష్ట్ర మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు తుల్లిబిల్లి అశోక్ బాబు తెలిపారు. డప్పులు కొట్టేవారు అన్ని కులాల్లో ఉంటారని, చర్మవృత్తులు చేసేవారు వేరే కులాల్లో ఉన్నప్పటికీ పెన్షన్ స్కీమ్‌కు అర్హులేనని ఆయన పేర్కొన్నారు. కులంతో సంబంధం లేకుండా డప్పు కళాకారులైనా, చర్మ కళాకారులైనా అర్హులందరూ ఈ పెన్షన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పెన్షన్ పొందాలంటే తాను కళాకారుడినని పేర్కొంటూ స్వీయ ధ్రువీకరణ పత్రాన్ని సచివాలయ సిబ్బందికి అందించడంతో పాటు ఆదాయ సర్టిఫికేట్, కుల ధ్రువీకరణ సర్టిఫికేట్, ఆధార్ అప్‌డేషన్ సర్టిఫికేట్ తదితరాలను సచివాలయంలో సమర్పించాల్సి ఉంటుందని అశోక్ బాబు తెలిపారు. అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించిన అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం కళాకారుల పెన్షన్ అందిస్తుందని ఆయన పేర్కొన్నారు.



# మతం వ్యక్తిగతం.. మానవత్వమే ప్రధానం

**ఎవరి మత విశ్వాసాలు వారికి వ్యక్తిగతం**

**ఇతరుల నమ్మకాలను గౌరవించాలి**

**మతం పేరుతో విభేదాలు సృష్టించొద్దు**

**సహనం, సంయమనం ప్రతి ఒక్కరిలో అవసరం**

**మానసిక ప్రశాంతతకు సానుకూల ఆలోచనలు ముఖ్యం**

**మానవత్వంతో సమాజం ముందుకు సాగాలి**

**కర్నూలు, సెప్టెంబర్ 15 (కొత్త స్వరం):**

మతం అనేది ప్రతి వ్యక్తికి సంబంధించిన వ్యక్తిగత విశ్వాసమని, ఎవరి మత విశ్వాసాలను వారు స్వేచ్ఛగా ఆచరించుకునే హక్కు ఉన్నప్పటికీ ఇతరుల నమ్మకాలు, ఆచారాలు, విశ్వాసాలను కూడా గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సంఘమిత్ర పాలీ క్లినిక్ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ హరిప్రసాద్ కంచర్ల అన్నారు. కర్నూలులోని గాయత్రి ఎస్టేట్‌లో ఉన్న తన క్లినిక్‌లో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిప్రసాద్ కంచర్ల మాట్లాడుతూ.. మత విశ్వాసాలు వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అంశాలని, వాటిని ఇతరులపై బలవంతంగా రుద్దడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన మతాన్ని, విశ్వాసాలను, ఆచారాలను పాటిస్తూ ఇతరుల విశ్వాసాలను కూడా గౌరవించే సంస్కారం అలవర్చుకోవాలని సూచించారు. మతం విషయంలో పరస్పర గౌరవం, సహనం, సంయమనం పాటించినప్పుడే సమాజంలో ప్రశాంతత వాతావరణం నెలకొంటుందని తెలిపారు. ఒకరి నమ్మకాలపై మరొకరు అనవసర వ్యాఖ్యలు చేయడం, అవమానించడం లేదా అపోహలు సృష్టించడం వల్ల వ్యక్తుల మధ్య దూరం పెరగడంతో పాటు మానసిక ఒత్తిడి కూడా ఏర్పడే అవకాశం ఉంటుందని వివరించారు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల ప్రభావంతో మతపరమైన అంశాలపై వివిధ రకాల ప్రచారాలు జరుగుతున్న నేపథ్యంలో వాస్తవాలను తెలుసుకోకుండా స్పందించకూడదని, భావోద్వేగాలకు లోనుకాకుండా సంయమనంతో వ్యవహరించాలని సూచించారు.




కుటుంబాల్లోనూ, సమాజంలోనూ పిల్లలకు చిన్ననాటి నుంచే ఇతరుల విశ్వాసాలను గౌరవించడం, భిన్నత్వాన్ని అర్థం చేసుకోవడం, పరస్పరం సహకరించుకోవడం వంటి విలువలను నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి వ్యక్తి మానసిక ప్రశాంతతతో జీవించాలంటే ద్వేషం, అసహనం, అనవసర వివాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. మతం ఏదైనా మానవత్వం, ప్రేమ, పరస్పర సహకారం, సేవాభావం వంటి విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. సమాజంలో భిన్న మతాలు, భిన్న అభిప్రాయాలు, భిన్న సంస్కృతులు ఉన్నప్పటికీ అందరినీ కలుపుకొని ముందుకు వెళ్లే విధంగా సానుకూల వాతావరణాన్ని నిర్మించుకోవాలని డాక్టర్ హరిప్రసాద్ కంచర్ల పిలుపునిచ్చారు. వ్యక్తిగత విశ్వాసాలకు గౌరవం ఇస్తూనే సామాజిక బాధ్యతను గుర్తుంచుకుని ప్రతి ఒక్కరూ వ్యవహరించినప్పుడు సమాజంలో శాంతి, సామరస్యం మరింత బలపడుతుందని ఆయన పేర్కొన్నారు.

# ఆగా ఖాన్ ఫౌండేషన్‌తో మరింత సహకారం

(మొదటి పేజీ తరువాయి)

కార్యకలాపాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతంలోని చారిత్రక సిటీ కాలేజ్, ఉస్మానియా ఆసుపత్రి భవనాల పునరుద్ధరణలో సహకరించాలని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్‌ను కోరారు. ఉస్మానియా ఆసుపత్రి కోసం గోషామహల్‌లో నూతన భవనాన్ని నిర్మిస్తున్నామని, ప్రస్తుత ఉస్మానియా ఆసుపత్రి భవనాన్ని వారసత్వ సంపదగా తీర్చిదిద్దాలని భావిస్తున్నట్లు సీఎం వివరించారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు మూడు రోజుల పాటు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాలని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్–ను సీఎం ఆహ్వానించారు. ఈ సమ్మిట్‌కు 100కు పైగా దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణంపై ప్రిన్స్ ఆగా ఖాన్ ఆసక్తి కనబరచగా, దాని ప్రాధాన్యతను సీఎం వివరించారు. 30 వేల ఎకరాల్లో అత్యాధునిక సదుపాయాలతో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని, అంతర్జాతీయ విమానాశ్రయానికి 20 నిమిషాల దూరంలో ఉండే ఈ నగరాన్ని పూర్తిగా నెట్–జీరో సిటీగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. సింగపూర్‌కు చెందిన ఓ కంపెనీ ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తోందని, ఇందులో దాదాపు 15 వేల ఎకరాల్లో గ్రీన్ జోన్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఫ్యూచర్ సిటీలో అమెజాన్ వంటి సంస్థలు ఇప్పటికే తమ కార్యకలాపాలను ప్రారంభించాయని, 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని వివరించారు. ఇటీవల బ్రిటన్, అమెరికా పర్యటనల్లో వివిధ ప్రపంచస్థాయి యూనివర్సిటీలతో తెలంగాణ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాల గురించి సీఎం సలహాదారు కె. రామకృష్ణారావు ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్–ఎకు వివరించారు. హార్వర్డ్ యూనివర్సిటీ, లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌తో పాటు ఇతర యూనివర్సిటీలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలు ప్రారంభించేందుకు అంగీకరించాయని తెలిపారు. ఫ్యూచర్ సిటీలో ఆగా ఖాన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా కోరారు. పర్యాటక రంగంలో ఆగా ఖాన్ ఫౌండేషన్ పాత్రను స్పెషల్ చీఫ్ సెక్రటరీ వాణీ ప్రసాద్ గుర్తుచేస్తూ భవిష్యత్తులో మరింత సహకారం అందించాలని కోరారు. సమావేశంలో మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో పాటు ఉన్నతాధికారులు, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.





# 22ఏ భూముల సమస్యపై రఘునందన్ రావు ఆందోళన

**లక్షలాది మంది రిజిస్ట్రేషన్లకు ఇబ్బందులు పడుతున్నారన్న ఎంపీ**

**మంత్రి పొంగులేటి సమాధానంపై విమర్శలు**

**47,440 ఎకరాల తొలగింపు వివరాలు వెల్లడించాలని డిమాండ్**

**22ఏ భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలని విజ్ఞప్తి**

**ధరణి, భూభారతి సమస్యలపై ప్రత్యేక కమిటీకి డిమాండ్**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16 (కొత్త స్వరం) :**

తెలంగాణలో 22ఏ నిషేధిత జాబితాలోని భూముల సమస్య తీవ్ర రూపం దాల్చిందని, దీనివల్ల లక్షలాది మంది సామాన్య ప్రజలు రిజిస్ట్రేషన్లు చేసుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. న్యూఢిల్లీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో 22ఏ భూములపై స్పష్టమైన నిర్ణయం వస్తుందని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలిందన్నారు. ఈ అంశంపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తగిన సన్నాహాలు లేకుండా సభకు వచ్చి అరకొర సమాచారంతో సమాధానం దాటవేసే ప్రయత్నం చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో భారీగా భూములను 22ఏ జాబితాలో చేర్చిన అధికారులపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. 22ఏ జాబితా నుంచి తొలగించినట్లు ప్రభుత్వం పేర్కొన్న 47,440 ఎకరాలు ఏ గ్రామంలో, ఎక్కడ ఉన్నాయో వివరాలను బహిర్గతం చేయాలని, మిగిలిన భూములపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాగా, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అసెంబ్లీలో వెల్లడించిన గణాంకాల ప్రకారం 2023 డిసెంబర్‌లో 22ఏ జాబితాలో ఉన్న మొత్తం భూమి 1,02,52,690 ఎకరాల నుంచి 2026 ఆగస్టు 31 నాటికి 1,02,05,250 ఎకరాలకు తగ్గిందని, మొత్తం 47,440 ఎకరాల మేర తగ్గుదల నమోదైందని ప్రభుత్వం తెలిపింది. ఈ నేపథ్యంలో రఘునందన్ రావు మాత్రం తొలగించిన భూముల పూర్తి వివరాలను ప్రజల ముందుంచాలని కోరారు. ధరణి, భూభారతి వ్యవస్థల్లోని లోపాల వల్ల నష్టపోయిన పేదలకు న్యాయం చేసేందుకు తెలంగాణ హైకోర్టు సిట్టింగ్ జడ్జితో కూడిన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనంటూ కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ విమర్శలకు దిగుతోందని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే తొలి కేబినెట్ సమావేశంలోనే భూ సమస్యలకు పరిష్కారం చూపుతామని రఘునందన్ రావు పేర్కొన్నారు.

# సాగునీరు అందించడంలో.. ప్రభుత్వం విఫలం





**రైతుల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా?**

**దెబ్బతిన్న పైప్‌లైన్‌తో ఖరీఫ్ సాగుకు ఇబ్బందులు**

**వర్షాభావంతో రైతులకు తప్పని కష్టాలు**

**ఎత్తిపోతల పథకాన్ని వెంటనే అందుబాటులోకి తేవాలి**

**ఇరిగేషన్ ఎండీకి సమస్య వివరించిన మాజీ ఎమ్మెల్యే**

**కొత్తపల్లి, సెప్టెంబర్ 15 (కొత్త స్వరం) :**

రైతుల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా అని నందికొట్కూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి ప్రభుత్వంపై మండిపడ్డారు. పక్కనే కృష్ణానది ప్రవహిస్తున్నప్పటికీ కొత్తపల్లి మండలం కరువు పరిస్థితులతో అల్లాడుతుండటం బాధాకరమన్నారు. ఖరీఫ్ సాగుకు అవసరమైన సాగునీటిని అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. మంగళవారం మండలంలోని పెద్దగుమ్మడాపురం వద్ద దెబ్బతిన్న పైప్‌లైన్‌ను, ముసలిమడుగు గ్రామ పొలిమేరలోని సంగమేశ్వరం, శివపురం గ్రామ శివార్లలో ఉన్న ఎత్తిపోతల పథకాన్ని స్థానిక రైతులతో కలిసి పరిశీలించి, వారు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లబ్బి వెంకటస్వామి మాట్లాడుతూ పంటలు సాగు చేసుకునే సమయంలో ఎత్తిపోతల పథకం ప్రధాన పైప్‌లైన్ దెబ్బతిని మరమ్మతులకు గురైనప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పైప్‌లైన్ ద్వారా అందాల్సిన నీరు రైతుల పొలాలకు చేరకపోవడంతో ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఇప్పటికే వర్షాభావ పరిస్థితులతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సాగునీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పట్ల కూటమి ప్రభుత్వం సవతి ప్రేమ చూపిస్తోందని విమర్శించారు. రైతులు పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేస్తున్న సమయంలో సాగునీరు అందకపోతే వారి పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని అన్నారు. వెంటనే దెబ్బతిన్న పైప్‌లైన్‌కు శాశ్వత మరమ్మతులు చేపట్టి ఎత్తిపోతల పథకాన్ని అందుబాటులోకి తీసుకురావాలని, ఖరీఫ్ పంటలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం చరవాణిలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇరిగేషన్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ తిరుమలరావుతో మాట్లాడి ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ పరిస్థితిని వివరించి, రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన అధికార యంత్రాంగం ఎత్తిపోతల పైప్‌లైన్‌ను పరిశీలించి త్వరితగతిన మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు లబ్బి వెంకటస్వామి తెలిపారు. కార్యక్రమంలో రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

# 2029 నాటికి అర్హులందరికీ పక్కా ఇళ్లు

(మొదటి పేజీ తరువాయి)

2027 నాటికి 5.52 లక్షల ఇళ్లను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్, పీఎం జన్మన్ సహా వివిధ పథకాల కింద చేపట్టే ఇళ్ల నిర్మాణాలను వచ్చే నెలలోనే గ్రౌండింగ్ చేయాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో 1.50 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టాలని, డిసెంబర్ 2026 నాటికి 2.05 లక్షల ఇళ్లు, మార్చి 2027 నాటికి మరో 2.74 లక్షల ఇళ్లను పూర్తి చేసి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని సూచించారు. రాష్ట్రంలో పీఎంఏవై 1.0, పీఎంఏవై 2.0, పీఎం జన్మన్ పథకాల కింద 18.72 లక్షల ఇళ్లు మంజూరయ్యాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇప్పటివరకు 13.20 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ పరిధిలో 16.11 లక్షల ఇళ్లకు గాను 11.31 లక్షల ఇళ్లు పూర్తయ్యాయని తెలిపారు. ఏపీ టిడ్కో పరిధిలో 2.61 లక్షల ఇళ్లు మంజూరు కాగా 1.88 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని వివరించారు. మరో 1.50 లక్షల ఇళ్లను పైప్‌లైన్‌లోకి తీసుకురావడంతో పాటు డిసెంబర్ 2027 నాటికి కొత్తగా 75 వేల ఇళ్లకు మంజూరు పొందేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇందుకోసం కేంద్ర గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి శాఖలతో సమన్వయం చేసుకుని అవసరమైన కేటాయింపులు పొందాలని స్పష్టం చేశారు. ఉచిత ఇళ్ల స్థలాల విషయంలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆవాస్ ప్లస్, హౌసింగ్, రెవెన్యూ శాఖల సమాచారంతో పాటు ఆర్టీజీఎస్ డేటాను అనుసంధానం చేసి, డూప్లికేషన్ లేకుండా అర్హులను గుర్తించాలని సూచించారు. ప్రాథమిక లబ్ధిదారుల జాబితాలను ప్రచురించి, అభ్యంతరాలను స్వీకరించి, గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో వాటిని పారదర్శకంగా పరిష్కరించిన అనంతరం తుది జాబితాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇప్పటికే ఉన్న లేఅవుట్లలో నిర్మాణాలు చేపట్టని స్థలాలను గుర్తించి, భూమి అవసరాన్ని బట్టి రెండు లేదా మూడు సెంట్ల స్థలాలను



పునర్వ్యవస్థీకరించాలని సూచించారు. ఖాళీ స్థలాలను గుర్తించి అర్హులైన లబ్ధిదారులకు మ్యాపింగ్ చేయడంతో పాటు ఇళ్ల నిర్మాణం పూర్తయ్యే వరకు నిరంతర పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. కుప్పం నియోజకవర్గంలోనూ సంతృప్తి విధానంలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి 2029 నాటికి సురక్షితమైన, శాశ్వత నివాసం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, శాఖల మధ్య సమన్వయంతో హౌసింగ్ ఫర్ ఆల్ లక్ష్యాన్ని పూర్తి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేంద్ర సహకారంతో వివిధ ప్రాంతాల్లో పారిశ్రామిక టౌన్‌షిప్‌ల నిర్మాణంపై హౌసింగ్ శాఖ ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. శ్రీ సిటీ సహా రాష్ట్రంలోని వివిధ పారిశ్రామిక ప్రాంతాల్లో పారిశ్రామిక టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేయడం ద్వారా ఆర్థిక లావాదేవీలను పెంచవచ్చని తెలిపారు. ఏపీఐఐసీతో సమన్వయం చేసుకుంటూ ఈ టౌన్‌షిప్‌ల నిర్మాణాన్ని చేపట్టాలని సూచించారు. సమీక్షలో హౌసింగ్ మంత్రి కొలుసు పార్థసారథి, హౌసింగ్ శాఖ, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## జిన్‌పింగ్‌తో భేటీలో భారత్ ఆందోళనలు ప్రస్తావించిన మోదీ

**మోదీ-జిన్‌పింగ్ మధ్య ద్వైపాక్షిక చర్చలు**

**పరస్పర గౌరవం, ప్రయోజనం, సున్నితత్వం అవసరమని స్పష్టీకరణ**

**భారత్ ఆందోళనలను జిన్‌పింగ్ దృష్టికి తీసుకెళ్లిన ప్రధాని**

**సరిహద్దుల్లో శాంతి, సుస్థిరతపై చర్చ**

**భాగస్వామ్య సంబంధాల కొనసాగింపుపై చైనా ప్రకటన**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16 (కొత్త స్వరం) :**

18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఇరు దేశాలు పరస్పరం తమ ఆందోళనలను అర్థం చేసుకుని, ఒకరి కీలక ఆందోళనల పట్ల మరొకరు సున్నితత్వంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ స్పష్టం చేసినట్లు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించిన వివరాల ప్రకారం, ద్వైపాక్షిక సంబంధాలు పరస్పర గౌరవం, పరస్పర ప్రయోజనం, పరస్పర సున్నితత్వం అనే మూడు సూత్రాల ఆధారంగా ముందుకు సాగాలని మోదీ పేర్కొన్నారు. భారత్‌కు సంబంధించిన కీలక ఆందోళనలను కూడా ఈ సందర్భంగా ప్రధాని ప్రస్తావించినట్లు తెలిపారు. మరోవైపు, సమావేశంపై చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ స్పందిస్తూ ఇరు దేశాలు పరస్పరం శత్రువులుగా కాకుండా భాగస్వాములుగా కొనసాగాలనే అంశంపై ఏకాభిప్రాయానికి వచ్చినట్లు పేర్కొన్నారు. సరిహద్దుల్లో శాంతి, సుస్థిరతలను కాపాడేందుకు ఇరువురు నేతలు అంగీకరించినట్లు వెల్లడించారు. భారత్ చైనాకు శత్రువు కాదని, భాగస్వామి అని ప్రధాని మోదీ పేర్కొన్నట్లు చైనా మీడియా కథనాలు వెల్లడించాయి. చైనాతో భారత్ విధానం ఏ ఇతర దేశ ప్రభావంతోనూ ముడిపడి ఉండదని మోదీ స్పష్టం చేసినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. కాగా, 2027లో బ్రిక్స్ కూటమికి చైనా అధ్యక్షత వహించనుంది.

## ‘ఢీ-10’ డ్యాన్స్ షో విన్నర్ రాజు అరెస్ట్

**లైంగికంగా వేధించాడని ఓ యువతి ఫిర్యాదు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 12(కొత్త స్వరం):**

తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన ‘ఢీ–10’ డ్యాన్స్ షో విజేత రాజును హైదరాబాద్ మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. లైంగిక వేధింపులకు పాల్పడటమే కాకుండా సినిమా అవకాశాలు ఇప్పిస్తానని చెప్పి మోసం చేశాడని ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్ విధించింది. వివరాల్లోకి వెళితే.. ఓ యువతి ఈ నెల 9న మియాపూర్ పోలీసులకు రాజుపై ఫిర్యాదు చేసింది. తనను లైంగికంగా వేధించాడని, సినీ రంగంలో అవకాశాల పేరుతో వంచించాడని ఫిర్యాదులో పేర్కొంది. దీని ఆధారంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆరోపణలకు సంబంధించి ప్రాథమిక ఆధారాలు లభించడంతో రాజును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే, రాజు అరెస్ట్ విషయాన్ని పోలీసులు ఇన్ని రోజులు గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది. తాజాగా ఈ వార్త బయటకు రావడంతో చర్చనీయాంశంగా మారింది. యువతి చేసిన ఆరోపణలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తు ముగిసిన తర్వాత వెల్లడయ్యే అవకాశం ఉంది.

## తెలుగు రాష్ట్రాలకు మరో 5 లక్షల ఇళ్లు

**పీఎంఏవై కింద అదనపు ఇళ్ల మంజూరు**

**ఏపీకి 3 లక్షలు.. తెలంగాణకు 2 లక్షలు**

**ఇళ్లు లేని పేద కుటుంబాలకు ప్రయోజనం**

**గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అర్హులకు అవకాశం**

**త్వరలో జిల్లాల వారీగా లబ్ధిదారుల ఎంపిక**

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (కొత్త స్వరం) :**

ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద తెలుగు రాష్ట్రాలకు ఇప్పటికే కేటాయించిన ఇళ్లకు అదనంగా మరో 5 లక్షల ఇళ్లను మంజూరు చేసింది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు 3 లక్షలు, తెలంగాణకు 2 లక్షల ఇళ్లు కేటాయించింది. తాజా నిర్ణయంతో రెండు రాష్ట్రాల్లోని ఇళ్లు లేని పేద కుటుంబాలకు ప్రయోజనం కలగనుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అర్హత ఉన్న కుటుంబాలు సొంతింటి నిర్మాణానికి కేంద్రం అందించే సహాయాన్ని పొందే అవకాశం ఉంటుంది. ఇప్పటికే తెలుగు రాష్ట్రాలకు పీఎంఏవై కింద భారీగా ఇళ్లను కేటాయించిన కేంద్రం తాజాగా మరో 5 లక్షల ఇళ్లకు ఆమోదం తెలిపింది. కొత్త కేటాయింపులతో మరింత మంది నిరుపేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరే అవకాశం ఉంది. త్వరలో జిల్లాల వారీగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభం కానుంది. అర్హతలు, ఎంపిక విధానం, లబ్ధిదారుల జాబితాకు సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులు వెల్లడించనున్నారు. అర్హత ఉన్న కుటుంబాలు ప్రభుత్వ ప్రకటనలపై దృష్టి పెట్టాలని అధికారులు సూచించారు.

## పోలీస్ స్టేషన్‌లోనే దాడి జరగడం దారుణం

**కేసీఆర్ నివాసంపై దాడిని ఖండించిన నేత**

**దాడిని అడ్డుకునేందుకు వెళ్తే నిర్బంధించారని ఆరోపణ**

**పీఏ, పీఆర్వోలపై పోలీస్ స్టేషన్‌లోనే దాడి జరిగిందని వెల్లడి**

**ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని ఆరోపణ**

**న్యాయస్థానాన్ని ఆశ్రయించి పోరాడతామని ప్రకటన**

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (కొత్త స్వరం) :**

తెలంగాణ తెచ్చిన నాయకుడు, ప్రతిపక్ష నేత కేసీఆర్ గారి నివాసంపై దాడి చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఆ దాడిని అడ్డుకోవడానికి తాము వెళ్తే, తమను పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించి, తమపై కూడా దాడికి యత్నించారని ఆరోపించారు. ఇప్పుడు ఏకంగా పోలీస్ స్టేషన్‌లోపలే తన పీఏ, పీఆర్వోలపై దాడి జరిగినా పోలీసులు కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయకపోవడం రాష్ట్రంలో శాంతిభద్రతల వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ అన్యాయంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించి పోరాడతామని తెలిపారు.

# ఎమ్మెల్యే పాయంకు ఘన సన్మానం

**పంచాయతీ రాజ్ చట్ట సవరణపై హర్షం**
**సెక్షన్ 70(3) సవరణకు స్వాగతం**
**సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు**
**మంత్రి సీతక్కకు ధన్యవాదాలు**
**గ్రామపంచాయతీలకు మరింత ప్రయోజనం**



**మణుగూరు, సెప్టెంబర్ 15 (కొత్త స్వరం):**

గ్రామపంచాయతీల సొంత ఆదాయాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేయకుండా, గ్రామపంచాయతీ ఖాతాల్లోనే జమ చేసుకొని, పంచాయతీ అవసరాలకు తీర్మానం చేసుకొని ఖర్చు చేసుకునే విధంగా పంచాయతీ రాజ్ చట్టం--2018 సెక్షన్ 70(3)ను సవరణ చేసి అసెంబ్లీలో ఆమోదం తెలిపి చట్ట సవరణ చేయడం పట్ల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీలకు ప్రయోజనం చేకూరేలా చట్ట సవరణ చేసినందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్కకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించి, ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ చట్ట సవరణతో గ్రామపంచాయతీల అభివృద్ధిని మరింత వేగవంతం చేయడంతో పాటు, స్థానికంగా ఉన్న సమస్యలను సత్వరం పరిష్కరించుకునేందుకు పంచాయతీలకు గొప్ప అవకాశం కలుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం సెప్టెంబర్ 15న మణుగూరు మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పినపాక మండలం అధ్యక్షులు పేరం వెంకటేశ్వర్లు, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆర్గనైజేషన్ సెక్రటరీ బోడ రమేష్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు చిట్టిమల్ల ప్రసాద్, నాయకులు కోర్స ఆనంద్, ఏడుల్లా యేసు, బీజ్జ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# గణనాథుడి ఆశీస్సులతో సింగరేణిలో వెలుగులు

**ఘనంగా వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన చి. కౌశిక్ నాయక్**
**ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ముఖ్య అనుచరుడు హాట్కార్ రాంబాబు నాయక్ తనయుడు**
**మండల ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు**
**భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించాలని పిలుపు**
**పర్యావరణహితంగా వేడుకలు జరుపుకోవాలని సూచన**

**కారేపల్లి, సెప్టెంబర్ 15 (కొత్త స్వరం):**




విఘ్నాలను తొలగించి విజయాలను ప్రసాదించే విఘ్నేశ్వరుడి కృపాకటాక్షాలు సింగరేణి మండల ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షిస్తూ కొత్త స్వరం సింగరేణి మండల రిపోర్టర్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ముఖ్య అనుచరుడు హాట్కార్ రాంబాబు నాయక్ తనయుడు చి. కౌశిక్ నాయక్ మండల ప్రజలకు వినాయక చవితి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. వినాయక చవితి పర్వదినం సందర్భంగా ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో గణనాథుడిని పూజించి, ఉత్సవాలను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కౌశిక్ నాయక్ కోరారు. గణపతి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రజలంతా ఐకమత్యంతో ఉత్సవాలను నిర్వహిస్తూ సామాజిక సోదరభావం, భక్తి, సంప్రదాయాలకు ప్రతీకగా వినాయక చవితిని జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ పర్యావరణహితంగా ఉత్సవాలను నిర్వహించాలని సూచించారు. "గణనాథుడి దీవెనలతో ప్రతి ఇంటా ఆనందం, ప్రతి కుటుంబంలో ఆరోగ్యం, ప్రతి అడుగులో విజయం కలగాలి. సింగరేణి మండలం మరింత అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నాను" అని చి. కౌశిక్ నాయక్ ఆకాంక్షించారు.

# విఘ్నాలు తొలగాలి.. విజయాలు వెల్లివిరియాలి!

**గణనాథుని ఆశీస్సులతో ప్రతి ఇంటా ఆనందం**
**ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు**
**ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం వెల్లివిరియాలి**
**భక్తిశ్రద్ధలతో వేడుకలు జరుపుకోవాలి**
**ప్రతి అడుగులో విజయం కలగాలి**



**కారేపల్లి, సెప్టెంబర్ 15 (కొత్త స్వరం):**

సింగరేణి మండలంలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మిషన్ వాక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ బాదావత్ రవి ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రతి కుటుంబం ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం, ప్రశాంతతతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. విఘ్నాలను తొలగించి విజయాలను అందించే గణనాథుని కృప ప్రతి ఒక్కరిపై ఉండాలని కోరారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలను జరుపుకోవాలని, ప్రతి మంచి కార్యం విజయవంతం కావాలని డాక్టర్ బాదావత్ రవి ఆకాంక్షించారు. "ప్రతి ఇంటా ఆనందం.. ప్రతి హృదయంలో భక్తి.. ప్రతి అడుగులో విజయం కలగాలి" అని ఆయన పేర్కొన్నారు. గణపతి బప్పా మోరియా.. శ్రీ గణేశాయ నమః!

# శ్రీ నవనంది విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలి




**అక్రమ ఫీజుల వసూళ్లపై చర్యలు తీసుకోవాలి**
**అనుమతి లేకుండా హాస్టల్ నిర్వహణ**
**ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదని ఆరోపణ**
**విద్యార్థుల తల్లిదండ్రులపై ఫీజుల భారం**
**గుర్తింపు రద్దు చేసే వరకు పోరాటాలు**

**నందికొట్కూరు, సెప్టెంబర్ 15 (కొత్త స్వరం):**


నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణంలోని శ్రీ నవనంది హైస్కూల్ ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా తమ ఇష్టానుసారంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పి.డి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎండి రఫీ డిమాండ్ చేశారు. మంగళవారం నందికొట్కూరు పట్టణంలోని స్థానిక భరత్ కాంప్లెక్స్‌లో పి.డి.ఎస్.యు ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం పి.డి.ఎస్.యు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.మధ్రిస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎండి రఫీ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలోని నందికొట్కూరు పట్టణంలో శ్రీ నవనంది హైస్కూల్‌లో వివిధ రకాల పేర్లతో జరుగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యు) డిమాండ్ చేస్తోందన్నారు. శ్రీ నవనంది విద్యాసంస్థల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అనేక రకాల పేర్లతో విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పుస్తకాలు, యూనిఫారం, స్పెషల్ ఫీజు, అడ్మిషన్ ఫీజు తదితర పేర్లతో వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని అన్నారు. ఎటువంటి అనుమతి లేకుండా హాస్టల్ నిర్వహిస్తున్న శ్రీ నవనంది హైస్కూల్‌పై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ అధికారులు నిద్రావస్థలో ఉండటం వల్ల విద్యను అంగడి సరుకుగా మారుస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు శ్రీ నవనంది హైస్కూల్‌ను తక్షణమే తనిఖీలు నిర్వహించి, అక్రమ ఫీజులు వసూలు చేస్తూ, మౌలిక వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమైన విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. శ్రీ నవనంది హైస్కూల్ గుర్తింపు రద్దు చేసేంత వరకు పి.డి.ఎస్.యు ఆధ్వర్యంలో దశలవారీ ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా నాయకులు పి.లాజరస్, సీపీఎం డివిజన్ నాయకులు కర్ణ, భాష, పీవైఎల్ రాష్ట్ర నాయకులు నవీన్, ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు హరిప్రసాద్, మాల మహానాడు విద్యార్థి సంఘం పుల్లన్న, ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రేమ రాజు, రైతు కూలి సంఘం జిల్లా నాయకులు చాంద్‌బాషా, పి.డి.ఎస్.యు నందికొట్కూరు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆసిఫ్, సాయి, నాయకులు కార్తీక్, విక్రం, బాలు, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

# కారేపల్లిలో డ్రైనేజీ లేక రహదారులు చెరువులే!

**వర్షం వస్తే చాలు.. రోడ్లపై నీటి ముంపు**
**ఇళ్లలోకి చేరుతున్న వర్షపు నీరు**
**డ్రైనేజీ కాలువలు పూడికతో నిండిన వైనం**
**ప్రజలకు తప్పని తిప్పలు**
**శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్**

**కారేపల్లి (సింగరేణి), సెప్టెంబర్ 15 (కొత్త స్వరం):**

కారేపల్లి మండలంలో వర్షాలు కురిసిన ప్రతిసారీ డ్రైనేజీ వ్యవస్థలోని లోపాలు స్పష్టంగా బయటపడుతున్నాయి. వర్షపు నీరు వెళ్లేందుకు సరైన కాలువలు, మురుగునీటి పారుదల వ్యవస్థ లేకపోవడంతో ప్రధాన రహదారులు, కాలనీల్లోని వీధులు నీటితో నిండిపోయి చెరువులను తలపిస్తున్నాయి. వర్షం కురిసిన కొద్ది సేపటికే రహదారులపై భారీగా నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు ప్రాంతాల్లో రోడ్లపై బురద పేరుకుపోవడంతో ద్విచక్ర వాహనదారులు జారిపడే ప్రమాదం నెలకొంది. మరోవైపు లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వర్షం తగ్గిన తర్వాత కూడా నీరు గంటల తరబడి రహదారులపై నిలిచిపోవడంతో ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. కాలనీల్లో డ్రైనేజీ కాలువలు ఉన్నప్పటికీ అవి సక్రమంగా లేకపోవడం, పూడికతో నిండిపోవడం, నీరు వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడం సమస్యకు ప్రధాన కారణాలని స్థానికులు చెబుతున్నారు. ప్రతి వర్షాకాలంలో ఇదే పరిస్థితి పునరావృతమవుతున్నప్పటికీ శాశ్వత పరిష్కారం చూపకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాలని కోరుతున్నారు. పూడికతో నిండిన డ్రైనేజీ కాలువలను వెంటనే శుభ్రం చేయడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్త కాలువలు నిర్మించాలని, రహదారులపై నిలిచిన వర్షపు నీటిని తక్షణమే తొలగించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. భవిష్యత్తులో వర్షాలు కురిసిన ప్రతిసారీ ఇదే సమస్య తలెత్తకుండా సమగ్ర డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# బొక్కలతండాలో ఘనంగా వినాయక చవితి

**పూజలో పాల్గొన్న సర్పంచ్ దంపతులు**
**ఆధ్యాత్మిక శోభతో పులకించిన తండా**
**శాస్త్రోక్తంగా గణనాథునికి ప్రత్యేక పూజలు**
**గ్రామ ప్రజల సుఖసంతోషాల కోసం ప్రార్థనలు**
**భక్తిశ్రద్ధలతో పాల్గొన్న గ్రామస్థులు**

**కారేపల్లి, సెప్టెంబర్ 15 (కొత్త స్వరం):**

ఖమ్మం జిల్లా సింగరేణి మండల పరిధిలోని బొక్కలతండా గ్రామం బొడ్రాయి సెంటర్‌లో వినాయక చవితి పండుగ మహోత్సవాలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగాయి. సోమవారం రాత్రి నిర్వహించిన విశేష గణపతి పూజా కార్యక్రమంలో భజ్య తండా సర్పంచ్ వాంకుడోత్ హనుమంతరావు-విజయ దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక చవితిని పురస్కరించుకుని మండపంలో ప్రతిష్ఠించిన గణనాథునికి ధూప, దీప, నైవేద్యాలతో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. సర్పంచ్ దంపతులు స్వామివారికి పత్ర పూజ, పుష్పార్చన చేసి, తండా ప్రజలందరికీ విఘ్నేశ్వరుని ఆశీస్సులు లభించాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ వాంకుడోత్ హనుమంతరావు మాట్లాడుతూ విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరుని కృపతో ప్రాంత ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, గ్రామంలో ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, సోదరభావంతో మెలగాలని స్వామివారిని వేడుకున్నానన్నారు. ఐక్యతతో జరుపుకునే ఇలాంటి పండుగలు మన సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని తెలిపారు. ఈ ఆధ్యాత్మిక వేడుకలో సర్పంచ్ కుటుంబ సభ్యులతో పాటు గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, తండా పెద్దలు, యువకులు, మహిళలు, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొని పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తుల జయజయధ్వానాలతో బొక్కలతండా గ్రామం భక్తిపారవశ్యంలో మునిగితేలింది.



# విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం!

**వ్యాన్ ఫుట్‌బోర్డుపై వేలాడుతూ ప్రయాణం**
**ప్రమాదం పొంచి ఉన్నా పట్టించుకునే వారేరీ?**
**విద్యార్థుల రవాణాపై అధికారుల పర్యవేక్షణ ఏదీ?**
**నిబంధనలు ఉల్లంఘించే వ్యాన్లపై చర్యలు తీసుకోవాలి**
**ప్రమాదం జరిగాక కాదు.. ముందే అడ్డుకోవాలి**




**కారేపల్లి, సెప్టెంబర్ 15 (కొత్త స్వరం):**

ఖమ్మం జిల్లా కారేపల్లి మండలంలో విద్యార్థుల రవాణా భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. పాఠశాలలకు విద్యార్థులను తరలించే కొన్ని వ్యాన్లలో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించడంతో పాటు, తలుపుల వద్ద, ఫుట్‌బోర్డుపై నిలబడి ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న దృశ్యాలు స్థానికులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. విశ్వనాధపల్లి, బొక్కలతండా మీదుగా కారేపల్లి వైపు వెళ్తున్న ఓ వాహనంలో విద్యార్థులు ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. చిన్నారుల భద్రతకు ఏమాత్రం అనుకూలంగా లేని ఈ పరిస్థితులు ఎప్పుడైనా తీవ్ర ప్రమాదానికి దారితీసే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులను పాఠశాలలకు తరలించే వాహనాల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాల్సి ఉన్నప్పటికీ, కొన్ని వాహనాల్లో నిబంధనలు అమలవుతున్నాయా లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వాహనం సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించడం, తలుపులు సక్రమంగా మూసుకోకపోవడం, ఫుట్‌బోర్డుపై నిలబడి ప్రయాణించడం వంటి ప్రమాదకర పరిస్థితులు కనిపిస్తే సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉంది. విద్యార్థుల భద్రత విషయంలో కారేపల్లి మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) ప్రత్యేక దృష్టి సారించాలని తల్లిదండ్రులు, ప్రజలు కోరుతున్నారు. మండలంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి, విద్యార్థుల రవాణా వాహనాలపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అదేవిధంగా రవాణా శాఖ, పోలీస్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని వాహనాల ఫిట్‌నెస్, అనుమతులు, డ్రైవర్ అర్హతలు, విద్యార్థుల సంఖ్య, భద్రతా ప్రమాణాలను పరిశీలించాలని కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే సంబంధిత వాహన యజమానులు, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థుల భద్రత విషయంలో అధికారులు ప్రమాదం జరిగిన తర్వాత చర్యలు తీసుకునే పరిస్థితి రాకుండా ముందస్తు తనిఖీలకు శ్రీకారం చుట్టాలని ప్రజలు కోరుతున్నారు. పాఠశాల యాజమాన్యాలు రవాణా ఫీజులు వసూలు చేయడంతో పాటు విద్యార్థులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే బాధ్యతను కూడా సమర్థంగా నిర్వర్తించాలని తల్లిదండ్రులు అంటున్నారు. "మా పిల్లలు పాఠశాలకు సురక్షితంగా వెళ్లి.. తిరిగి ఇంటికి క్షేమంగా రావాలి. ఒక ప్రమాదం జరిగే వరకు అధికారులు వేచి చూడకూడదు" అని తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థుల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని కారేపల్లి మండలంలోని పాఠశాల విద్యార్థుల రవాణా వాహనాలపై తక్షణమే ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

# నిమజ్జన ఘాట్‌లను పరిశీలించిన ఎస్పీ

**పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశం**
**అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చర్యలు**
**ప్రజల రాకపోకలపై ప్రత్యేక దృష్టి**
**రద్దీ నియంత్రణకు పోలీసుల అప్రమత్తత**
**భక్తులు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి**





**పాములపాడు/ఆత్మకూరు, సెప్టెంబర్ 15 (కొత్త స్వరం):**

వినాయక నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించేందుకు పోలీస్ శాఖ ముందస్తు చర్యలు చేపడుతోందని నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ అన్నారు. ఈ నేపథ్యంలో నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ నేడు ఆత్మకూరు సబ్ డివిజన్ పరిధిలోని వెలుగోడు, ఆత్మకూరు, పాములపాడు, జూపాడుబంగ్లా తదితర పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న వినాయక నిమజ్జన ఘాట్‌లను, ఊరేగింపు జరిగే ప్రధాన ప్రాంతాలను స్వయంగా సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా నిమజ్జన ఘాట్‌ల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా చర్యలు, ప్రజల రాకపోకలు, వాహనాల నియంత్రణ, పోలీస్ బందోబస్తు తదితర అంశాలపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వినాయక నిమజ్జనం సందర్భంగా భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు. నిమజ్జన కార్యక్రమాలు సజావుగా జరిగేలా ఘాట్‌ల వద్ద నిరంతరం పోలీస్ సిబ్బంది అందుబాటులో ఉండాలని, రద్దీని క్రమబద్ధీకరించడంతో పాటు ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అలాగే నిమజ్జన కార్యక్రమాల్లో పాల్గొనే ప్రజలు పోలీసులకు సహకరించి, పోలీస్ శాఖ సూచించిన భద్రతా నిబంధనలను పాటించాలని జిల్లా ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు ఆత్మకూరు డీఎస్పీ రామంజి నాయక్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ అశోక్, ఆత్మకూరు అర్బన్ సీఐ మహేశ్వర్ రెడ్డి, రూరల్ సీఐ ఎం.సురేష్ కుమార్ రెడ్డి, పాములపాడు ఎస్ఐ పి.తిరుపాలు, సంబంధిత పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# పాలిక శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు

**- సీనియర్ జర్నలిస్ట్‌కు శుభాకాంక్షల వెల్లువ - ఫోన్‌లో అభినందించిన మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్ - దంపతులను ఘనంగా సన్మానించిన అజ్మీరా వీరన్న - కుటుంబ సభ్యుల సమక్షంలో జన్మదిన వేడుకలు - హాజరైన నాయకులు, జర్నలిస్టులు, అభిమానులు**



**కారేపల్లి, సెప్టెంబర్ 15 (కొత్త స్వరం):**

మండల కేంద్రంలో సాక్షి సీనియర్ జర్నలిస్ట్ పాలిక శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు సోమవారం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. తన నివాసంలో కుటుంబ సభ్యుల సమక్షంలో నిర్వహించిన ఈ వేడుకలకు పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, జర్నలిస్టు మిత్రులు, అభిమానులు హాజరై శ్రీనివాసరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మండల ప్రధాన కార్యదర్శి, సీనియర్ జర్నలిస్ట్ అజ్మీరా వీరన్న శ్రీనివాసరావు దంపతులను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం వారి చేతుల మీదుగా కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా మాజీ శాసనసభ్యులు లావుడ్యా రాములు నాయక్ ఫోన్ ద్వారా శ్రీనివాసరావును అభినందించారు. ఆయనకు ఆయురారోగ్యాలు, ఆనంద ఐశ్వర్యాలు కలగాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ భూక్యా రాజేష్, ప్రముఖ నాయకులు వాంకుడోత్ కరన్ సింగ్‌తో పాటు పలువురు స్థానిక నాయకులు, జర్నలిస్టులు, అభిమానులు పాల్గొని శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

# విద్యార్థులకు షూస్ పంపిణీ

**పాఠశాల ఆవరణలో మొక్కలు నాటిన సర్పంచ్**
**విద్యతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం**
**విద్యార్థుల సంక్షేమానికి గ్రామపంచాయతీ సహకారం**
**మౌలిక సదుపాయాలతో విద్యార్థులను ప్రోత్సహించాలి**
**పచ్చదనంతో ఆహ్లాదకరమైన పాఠశాల వాతావరణం**

**కారేపల్లి, సెప్టెంబర్ 15 (కొత్త స్వరం):**





ఖమ్మం జిల్లా కారేపల్లి మండల పరిధిలోని భజ్య తండా గ్రామపంచాయతీ పరిధిలో విద్యార్థుల సంక్షేమం, పాఠశాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ కార్యక్రమాలు నిర్వహించారు. భజ్య తండా గ్రామపంచాయతీ సర్పంచ్ వాంకుడోత్ హనుమంతరావు చేతుల మీదుగా బొక్కలతండా ఎంపీపీఎస్ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు షూస్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ విద్యార్థులకు స్వయంగా షూస్ అందజేసి, వారి చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందించడం ద్వారా వారు మరింత ఉత్సాహంగా పాఠశాలకు హాజరై విద్యలో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం సర్పంచ్ హనుమంతరావు చేతుల మీదుగా పాఠశాల ఆవరణలో పూల మొక్కలు నాటారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా పాఠశాల వాతావరణాన్ని ఆహ్లాదకరంగా మార్చడంతో పాటు విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో మొక్కలు నాటినట్లు తెలిపారు. విద్యార్థుల సంక్షేమం, పాఠశాల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు గ్రామపంచాయతీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఫోక్సో కేసులో ముద్దాయికి జైలు

**బాలకృష్ణకు ఏడాది జైలు శిక్ష**

**రూ.50 వేల జరిమానా విధించిన న్యాయస్థానం**

**పకడ్బందీగా దర్యాప్తు చేసి చార్జిషీట్ దాఖలు**

**సాక్షులను సకాలంలో కోర్టుకు హాజరుపరిచిన పోలీసులు**

**అధికారులను అభినందించిన జిల్లా ఎస్పీ**



**సంజామల, సెప్టెంబర్ 15 (కొత్త స్వరం):**

ఫోక్సో కేసులో ముద్దాయి బోయ బాలకృష్ణకు న్యాయస్థానం ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.50,000 జరిమానా విధించింది. సంజామల పోలీస్ స్టేషన్ క్రైం నంబర్ 28/2023, సెక్షన్ 366 ఐపీసీ, సెక్షన్లు 11, 12 ఫోక్సో చట్టం కింద ఈ కేసు నమోదైంది. కేసు వివరాల ప్రకారం 12.03.2023న మధ్యాహ్నం 1.30 గంటలకు సంజామల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక గ్రామానికి చెందిన 12 ఏళ్ల బాలికను ఊరి బయట గుడి దగ్గరకు పిలిచి, తెల్ల కారులో బలవంతంగా ఎక్కించుకుని బేతంచెర్ల వైపు తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడని మైనర్ బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంజామల పోలీసులు కేసు నమోదు చేశారు. మరుసటి రోజు బాలిక తిరిగి రావడంతో 164 సీఆర్‌పీసీ స్టేట్‌మెంట్ మేరకు అప్పటి ఎస్సై ఎం.ప్రతాప్, ప్రస్తుతం నంద్యాల స్పెషల్ బ్రాంచ్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న వారు, ఎఫ్ఐఆర్ నమోదు నుంచి పూర్తి దర్యాప్తు, సాక్షుల స్టేట్‌మెంట్ల నమోదు, సాంకేతిక ఆధారాల సేకరణ, పకడ్బందీగా చార్జిషీట్ దాఖలు చేయడం వరకు మొత్తం బాధ్యత నిర్వహించి కేసును బలంగా కోర్టు ముందు నిలబెట్టారు. అనంతరం నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ పర్యవేక్షణలో ఆళ్లగడ్డ డీఎస్పీ శ్రీనివాసరావు సూచనలతో కోయిలకుంట్ల హనుమంత నాయక్, ప్రస్తుత ఎస్సై సి.రమణయ్య ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ మదన్ గోపాల్ కోర్టు విచారణ సమయంలో సాక్షులను సమయానికి కోర్టుకు హాజరుపరిచారు. న్యాయస్థానం వాదనలు విన్న అనంతరం ముద్దాయి బోయ బాలకృష్ణను దోషిగా పరిగణిస్తూ ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.50,000 జరిమానా విధించింది. కేసులో ముద్దాయికి శిక్ష పడేందుకు సాక్షులను కోర్టులో హాజరుపరిచేందుకు కృషి చేసిన అధికారులను, కోర్టు కానిస్టేబుల్‌ను జిల్లా ఎస్పీ అభినందించారు.

# ఉపాధ్యాయుడే నవ సమాజ నిర్మాత

**ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది**

**ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం**

**విద్యార్థుల సంఖ్య పెంచాలి.. నాణ్యమైన విద్య అందించాలి**

**ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి**



**నంద్యాల, సెప్టెంబర్ 15 (కొత్త స్వరం) :**

నవ సమాజ నిర్మాత ఉపాధ్యాయుడేనని రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి లక్క భూషణం, నంద్యాల, పాణ్యం మండల విద్యాధికారులు బ్రహ్మం నాయక్, కోటయ్య అన్నారు. పట్టణంలోని రోటరీ స్కూల్‌లో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం, మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం నంద్యాల జిల్లా ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు సుబ్బన్న అధ్యక్షతన అభినందన సభ నిర్వహించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్ నాయక్, ఉపాధ్యాయుడు ప్రతాప్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ సురేష్‌లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన బ్రహ్మం నాయక్, కోటయ్య, లక్క భూషణం, ఆళ్లగడ్డ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నల్లమల రాజు, ఎస్ఏపీడీ, పీఈటీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రవికుమార్, గౌరవాధ్యక్షుడు కేశవ నాయక్ తదితరులు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైనదని, ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడంతో పాటు నాణ్యమైన విద్యను అందించి చిన్నారులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు సుబ్బన్న మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. అవార్డు గ్రహీతలను రోటరీ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ సుబ్బయ్యతో కలిసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా సర్వేయర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అందర్-బహార్ జూదంపై పోలీసుల దాడి

**8 మంది అరెస్ట్.. రూ.1.25 లక్షల నగదు స్వాధీనం**

**52 పేక ముక్కలు, 7 బైక్‌లు పట్టివేత.. 8 మొబైల్ ఫోన్లు స్వాధీనం**

**పరారీలో ఉన్న వారి కోసం గాలింపు**



**జూపాడుబంగ్లా, సెప్టెంబర్ 15 (కొత్త స్వరం) :**

జూపాడుబంగ్లా మండలం మండ్లెం గ్రామ శివారులోని ఆశ్రయ ట్రస్ట్ వెనుక పొలాల్లో బహిరంగ ప్రదేశంలో అందర్-బహార్ జూదం నిర్వహిస్తున్నారన్న సమాచారంతో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు జూపాడుబంగ్లా ఎస్ఐ కె. మల్లికార్జున సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారు. ఈ దాడిలో సయ్యద్ అహ్మద్, బాకీ శివ రాముడు, అనకలి మల్లికార్జున, ఉప్పరి కుమార్, తెలుగు అశోక్ కుమార్, ఈడిగ పుల్లయ్య గౌడ్, కొండం నవీన్, సాకలి వెంకటేశ్వర్లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.1,25,630 నగదు, 52 పేక ముక్కలు, 7 మోటార్ సైకిళ్లు, 8 మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ కె. మల్లికార్జున తెలిపారు. పోలీసుల దాడిని గమనించిన కాటేపోగు దేవదాసు, చంద్ర, శ్రీను, బొల్లెద్దుల ప్రసాద్, అనంత బాబు సంఘటనా స్థలం నుంచి పరారైనట్లు ఎస్ఐ తెలిపారు. పరారీలో ఉన్న వారిని త్వరలోనే అరెస్ట్ చేస్తామని వెల్లడించారు.

# గణనాథుని సేవలో ఎస్పీ దంపతులు







**కొత్తపేట పోలీస్ క్వార్టర్స్‌లో ప్రత్యేక పూజలు**

**భక్తిశ్రద్ధలతో గణనాథునికి హారతులు**

**పోలీసు సిబ్బంది, భక్తులకు ప్రసాద వితరణ**

**జిల్లా ప్రజలకు ఎస్పీ దంపతుల శుభాకాంక్షలు**

**ప్రశాంత వాతావరణంలో నిమజ్జనాలు నిర్వహించాలి**

**కర్నూలు, సెప్టెంబర్ 15 (కొత్త స్వరం):**

వినాయక చవితి పండుగను పురస్కరించుకుని కర్నూలు టూ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని కొత్తపేట పోలీస్ క్వార్టర్స్‌లో భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించిన గణనాథునికి కర్నూలు ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్, కర్నూలు ఏపీఎస్పీ రెండో బెటాలియన్ కమాండెంట్ శ్రీమతి దీపికా పాటిల్ ఐపీఎస్ సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాథునికి హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పోలీసు సిబ్బందికి, భక్తులకు ప్రసాదాలను వితరణ చేశారు. గణనాథుని ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ప్రతి కుటుంబం అభివృద్ధిలో ముందుకు సాగాలని ఎస్పీ దంపతులు ఆకాంక్షించారు. వినాయక చవితి ఉత్సవాలు, రాబోయే నిమజ్జన కార్యక్రమాలను శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ పూజా కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ శ్రీ హుస్సేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీ కృష్ణమోహన్, కర్నూలు డీఎస్పీ రాఘవేంద్ర, పోలీస్ వెల్ఫేర్ హాస్పిటల్ డాక్టర్ శ్రీమతి స్రవంతి, కర్నూలు టూ టౌన్ సీఐ శ్రీధర్, కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు, కర్నూలు ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ ఇంజనీర్స్ దినోత్సవం





**విశ్వేశ్వరయ్యకు ఘన నివాళి**

**30 మంది ఇంజనీర్ల రక్తదానం**

**ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రాలు**

**క్రీడా పోటీల విజేతలకు బహుమతులు**

**నవజీవన్ బదిరుల పాఠశాలకు విరాళం**

**నంద్యాల, సెప్టెంబర్ 15 (కొత్త స్వరం) :**

భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన జాతీయ ఇంజనీర్స్ దినోత్సవాన్ని స్థానిక రామకృష్ణ పీజీ కళాశాల ఆడిటోరియంలో ఏపీ పంచాయతీరాజ్ ఇంజనీర్స్ అసోసియేషన్ జిల్లా విభాగం, పంచాయతీరాజ్ డిప్లమా ఇంజనీర్ల జిల్లా సంఘం, సచివాలయ ఇంజనీర్ల జిల్లా సంఘం సంయుక్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నంద్యాల విజయ బ్లడ్ బ్యాంక్ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. రఘురామిరెడ్డి, రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, లయన్స్ అంతర్జాతీయ సంస్థ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ ప్రారంభించగా, 30 మంది ఇంజనీర్లు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. రఘురామిరెడ్డి అధ్యక్షతన, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఇంజనీర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.వి. సుధాకర్ రెడ్డి, డిప్లమా ఇంజనీర్స్ సంఘం అధ్యక్షుడు శివశంకర్, సచివాలయ ఇంజనీర్స్ సంఘం అధ్యక్షుడు సంతోష్ రెడ్డి నిర్వహణలో జాతీయ ఇంజనీర్ల దినోత్సవ కార్యక్రమం జరిగింది. రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, లయన్స్ అంతర్జాతీయ సంస్థ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ అతిథులుగా పాల్గొన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంజనీర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన క్రికెట్, షటిల్, చెస్, క్యారమ్స్ క్రీడా పోటీల విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలో ఉత్తమ సేవలు అందించిన ఏడుగురు అసిస్టెంట్ ఇంజనీర్లతో పాటు ఇంజనీరింగ్ అసిస్టెంట్లలో మండలానికి ఒకరి చొప్పున 29 మందికి ఉత్తమ సేవా పురస్కారాలు అందజేశారు. నంద్యాల లయన్స్ క్లబ్ తరపున లయన్స్ సీనియర్ సభ్యులు, ఇంజనీర్లు సుధాకర్ రెడ్డి, సుధీర్ కుమార్ రెడ్డి సహకారంతో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రఘురామిరెడ్డి, విశ్రాంత ఇంజనీర్లు మురహరి రావు, పి. రాముడులకు జాతీయ ఇంజనీర్ల దినోత్సవ పురస్కారాలు అందించి సన్మానించారు. ఇంజనీర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని నవజీవన్ బదిరుల పాఠశాలకు క్రీడా పరికరాల కొనుగోలుకు రూ.12 వేల విరాళం అందించారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రఘురామిరెడ్డి మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జాతికి చేసిన సేవలను గుర్తుచేసి, ఆయన స్ఫూర్తితో యువ ఇంజనీర్లు జాతి నిర్మాణంలో పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి రంగంలో ఇంజనీర్ల పాత్ర ప్రముఖంగా ఉంటుందని, సాంకేతికతను పెంపొందించుకుని ప్రజలకు సేవలు అందించాలని కోరారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ మానవజాతి అభివృద్ధిలో ప్రతి దశలో ఇంజనీర్ల పాత్ర ఉందని, వైద్య, వ్యవసాయ, జాతీయ రక్షణ తదితర ప్రతి రంగంలో ఇంజనీర్లు సాధించిన ప్రగతి, పరిశోధనలు ప్రపంచ అభివృద్ధికి కీలకంగా ఉన్నాయని పేర్కొంటూ వారి సేవలను కొనియాడారు. పంచాయతీరాజ్ ఇంజనీర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుధాకర్ రెడ్డి సచివాలయ ఇంజనీర్ల సేవలను ప్రశంసించి, వారికి అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నెరవేర్చాలని అన్నారు. రామకృష్ణ పీజీ కళాశాల డైరెక్టర్ హేమంత్ రెడ్డి మాట్లాడుతూ యువ ఇంజనీర్లు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడం ద్వారా మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమాల్లో అతిథులుగా పాల్గొని ఇంజనీర్ల సేవలను కొనియాడిన డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ సహదేవుడు, రామకృష్ణ విద్యాసంస్థల డైరెక్టర్ హేమంత్ రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సందీప్‌లను మూడు ఇంజనీర్ సంఘాల తరపున సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇంజనీర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరెడ్డి, సచివాలయ ఇంజనీర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, సలహాదారు వంశీధర్, కోశాధికారి కరీముల్లా, పంచాయతీరాజ్ డీఈలు వహీద్, మన్మధ బాబు, అయాజ్ అహ్మద్, మల్లికార్జున, లక్ష్మీదేవి, నళిని, సుధాకర్ బాబు, రమణ, అసిస్టెంట్ ఇంజనీర్లు శ్రీనివాసులు, సుధీర్ కుమార్ రెడ్డి, వెంకటరాముడు, కమాల్ సాహెబ్, వెంకటరమణ, చెంచయ్య, జయన్న, లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యుడు డాక్టర్ సహదేవుడు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సందీప్ కుమార్, రీజియన్ చైర్మన్ నిజాముద్దీన్, జోనల్ చైర్మన్ నాగరాజు, రవి ప్రకాష్, యూసుఫ్, జనార్ధన్‌తో పాటు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన సచివాలయ ఇంజనీర్లు పాల్గొన్నారు.

# కే.సి. కెనాల్‌లో విద్యార్థి మృతి

**కాలుజారి పడి పదో తరగతి విద్యార్థి మృతి**

**114వ తూము వద్ద విషాద ఘటన**

**లింగస్వామి మృతితో గ్రామంలో విషాదం**

**పిల్లల భద్రతపై పోలీసుల హెచ్చరిక**

**తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచన**

**జూపాడుబంగ్లా, సెప్టెంబర్ 15 (కొత్త స్వరం) :**

జూపాడుబంగ్లా మండలంలోని తూడిచెర్ల మజారా గ్రామమైన కనకయ్యకొట్టాల సమీపంలో విషాద ఘటన చోటుచేసుకుంది. పదో తరగతి చదువుతున్న మేకల లింగస్వామి (14) కే.సి. కెనాల్‌లో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. సోమవారం ఉదయం 11.30 గంటల సమయంలో కే.సి. కెనాల్ 114వ తూము వద్ద కాలకృత్యాలు తీర్చుకునే సమయంలో ప్రమాదవశాత్తు కాలుజారి కాలువలో పడటంతో ఈ ఘటన జరిగినట్లు తెలిపారు. తండ్రి మేకల శివలింగేశ్వరుడు, తల్లి మేకల మధులతల చిన్న కుమారుడైన లింగస్వామి మృతి చెందడంతో కనకయ్యకొట్టాల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పిల్లలు సెలవు రోజుల్లోనే కాకుండా ఇతర సమయాల్లోనూ వాగులు, వంకలు, నదులు, బావులు, కాలువల వద్దకు వెళ్లి ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు పదేపదే హెచ్చరిస్తున్నారు. ఇలాంటి విషాద ఘటనలు పునరావృతం కాకుండా తల్లిదండ్రులు తమ పిల్లలను జాగ్రత్తగా పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉంచాలని పోలీసులు సూచించారు.








# గోల్డ్ కప్ విజేతగా లక్ష్య జట్టు

**హైదరాబాద్ గోల్డ్ కప్‌లో అద్భుత విజయం**

**ఫైనల్‌లో హైదరాబాద్ క్లబ్‌పై 4-2 గోల్స్‌తో గెలుపు**

**అరుణ, రేణుక చెరో రెండు గోల్స్**

**క్రీడాకారులకు బహుమతులు అందజేసిన ప్రముఖులు**

**కోచ్‌లను ప్రత్యేకంగా అభినందించిన నాగపురి రమేష్**




**కర్నూలు, సెప్టెంబర్ 15 (కొత్త స్వరం):**

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో సెప్టెంబర్ 12, 13 తేదీలలో నిర్వహించిన హైదరాబాద్ గోల్డ్ కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో కర్నూలుకు చెందిన లక్ష్య ఫుట్‌బాల్ జట్టు అద్భుత విజయం సాధించి విజేతగా నిలిచింది. ఈ పోటీలో 12 జట్లు పాల్గొనగా, ఫైనల్ మ్యాచ్‌లో లక్ష్య జట్టు హైదరాబాద్ క్లబ్‌పై 4-2 గోల్స్ తేడాతో ఘన విజయం సాధించింది. లక్ష్య జట్టు తరపున అరుణ 2 గోల్స్, రేణుక 2 గోల్స్ చేసి జట్టు విజయానికి తోడ్పడ్డారు. విజేతలకు నిర్వహించిన అభినందన సభకు తెలంగాణ రాష్ట్ర ఫుట్‌బాల్ సెక్రటరీ పాల్గుణ ముఖ్య అతిథిగా విచ్చేసి క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మహిళలు, బాలికలు పెద్ద సంఖ్యలో ఫుట్‌బాల్ క్రీడలో పాల్గొనడం ఎంతో అభినందనీయమని తెలిపారు. క్రీడా స్ఫూర్తితో బాలికలు ఫుట్‌బాల్‌లో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్ క్రీడాకారులకు బహుమతులు అందజేసి, ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఆదరణ పొందిన ఫుట్‌బాల్ క్రీడను అభ్యసించి దేశానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. లక్ష్య జట్టు ఇంతటి ఘన విజయం సాధించడానికి కృషి చేసిన మహిళల ఫుట్‌బాల్ కోచ్ కె. బ్రహ్మ కుమార్, భాగ్యమను నరసింహను నాగపురి రమేష్ ప్రత్యేకంగా అభినందించారు. లక్ష్య జట్టు విజయం క్రీడాకారులు, కోచ్‌లు, లక్ష్య కుటుంబానికి గర్వకారణంగా నిలిచింది.

# పర్యావరణహితంగా గణేష్ చతుర్థి వేడుకలు

**విద్యార్థుల చేతుల్లో మట్టి వినాయకులు**

**50 పర్యావరణహిత విగ్రహాలకు పూజలు**

**సృజనాత్మకతకు ప్రోత్సాహం**

**సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి**

**ప్రకృతి పరిరక్షణపై అవగాహన**





**నంద్యాల, సెప్టెంబర్ 15 (కొత్త స్వరం) :**

ఏపీ గణేష్ ఉత్సవ సమితి నంద్యాల జిల్లా, నంద్యాల నగర గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శ్రీ రామకృష్ణ డిగ్రీ అటానమస్ కళాశాల సహకారంతో కళాశాలలోని శ్రీ స్వామి వివేకానంద ఆడిటోరియంలో గణేష్ చతుర్థి వేడుకలను భక్తిశ్రద్ధలు, ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు స్వయంగా తయారు చేసిన పర్యావరణహిత గణేష్ విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నంద్యాల జిల్లా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, కార్యదర్శి రామాంజనేయులు, శంకర్, సత్యనారాయణ, విశ్వహిందూ పరిషత్ దక్షిణాంధ్ర అధ్యక్షుడు ఎర్రం విష్ణువర్ధన్ రెడ్డి, చిలుకూరి శ్రీనివాసులు, సుహాసిని తదితరులు పూజా కార్యక్రమంలో పాల్గొని భక్తిశ్రద్ధలతో గణనాథునికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ రామకృష్ణ డిగ్రీ అటానమస్ కళాశాల చైర్మన్ డాక్టర్ జి. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు దాదాపు 15 రోజుల పాటు శ్రమించి పర్యావరణానికి హాని కలిగించని సహజసిద్ధమైన పదార్థాలతో సృజనాత్మకంగా రూపొందించిన గణేష్ విగ్రహాలను పూజా కార్యక్రమంలో ఉంచామని తెలిపారు. దాదాపు 50 చిన్న, పెద్ద మట్టి గణనాథుని విగ్రహాలు పూజలందుకున్నాయని చెప్పారు. విద్యార్థుల్లోని సృజనాత్మక నైపుణ్యాలను వెలికితీయడం కళాశాల బాధ్యత అని, సమాజానికి, ప్రజలకు ఉపయోగపడే అంశాలపై అవగాహన కల్పించేందుకు ఈ బృహత్ కార్యక్రమాన్ని చేపట్టామని పేర్కొన్నారు. విద్యార్థులు సహజమైన మట్టితో గణేష్ ప్రతిమలను తయారు చేసి తమ బాధ్యతను నిరూపించుకున్నారని అన్నారు. విద్యార్థులను ఈ దిశగా ప్రోత్సహించిన డీన్ ఆఫ్ అకాడమిక్స్ ప్రగతి, డాక్టర్ లలితా సరస్వతి, శ్రావణి కుమారిని కళాశాల చైర్మన్ అభినందించారు. విద్యార్థినులు భక్తి పాటలతో పూజలు నిర్వహించి పూజా విధానాన్ని పాటించారు. ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో కష్టపడి తయారు చేసిన గణేష్ ప్రతిమలు ఆకర్షణీయంగా ఉన్నాయని, విద్యార్థులు సామాజికహిత కార్యక్రమంలో భాగస్వాములు కావడం సంతోషంగా ఉందని అన్నారు. భారతీయ ఆధ్యాత్మిక, సాంస్కృతిక విలువలను తెలియజేసేవి మన పండుగలని, ఈ సందర్భంగా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడంతో పాటు సంప్రదాయ పండుగలను పర్యావరణహితంగా నిర్వహించాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం అందించింది. కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు, గణేష్ ఉత్సవ సమితి సభ్యులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. "భక్తితో వినాయకుడిని ఆరాధిద్దాం... బాధ్యతతో ప్రకృతిని కాపాడుదాం" అనే సందేశంతో నిర్వహించిన ఈ వేడుకలు ఆదర్శప్రాయంగా నిలిచాయి. కార్యక్రమంలో నంద్యాల ఎయిమ్ ఫర్ సేవ విద్యార్థినులు ప్రదర్శించిన కోలాటం, నృత్యం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల విద్యార్థులు భక్తి పాటలకు నృత్యాలు చేశారు. "గణపతి బప్పా మోరియా" అంటూ విద్యార్థులంతా భక్తి పారవశ్యంతో ఆనందాన్ని వ్యక్తం చేయగా, ప్రసాద వితరణతో కార్యక్రమం ముగిసింది.

# కర్నూలులో నేడు మెగా జాబ్ మేళా

**22 కంపెనీల భాగస్వామ్యం**

**10వ తరగతి నుంచి డిగ్రీ వరకు అర్హత**

**18-35 ఏళ్ల అభ్యర్థులకు అవకాశం**

**నెలకు రూ.12 వేల నుంచి రూ.25 వేల వరకు జీతం**

**కర్నూలు, శ్రీసిటీ, హైదరాబాద్, చెన్నైలో ఉద్యోగావకాశాలు**

**కర్నూలు, సెప్టెంబర్ 15 (కొత్తస్వరం) :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (APSSDC) ఆధ్వర్యంలో, పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లాలోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల, సిరి నోబుల్ హాస్పిటల్ సమీపంలో, సుంకేసుల రోడ్డులో నిరుద్యోగ యువత కోసం నేడు జాబ్ మేళా నిర్వహించబడుతుంది. ఈ జాబ్ మేళాలో మొత్తం 22 కంపెనీలు పాల్గొంటున్నాయి. 10వ తరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ అర్హత కలిగిన 18–35 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న అభ్యర్థులు హాజరు కావచ్చు. అభ్యర్థులకు నెలకు రూ. 12,000–రూ. 25,000 వరకు జీతం లభిస్తుంది. ఉద్యోగావకాశాలు కర్నూలు జిల్లా, శ్రీసిటీ, హైదరాబాద్, చెన్నై ప్రాంతాల్లో ఉంటాయని తెలియజేశారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు https://naipunyam.ap.gov.in ద్వారా నమోదు చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు 8309283980, 8374231357 నంబర్లను సంప్రదించవచ్చు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ విద్యార్హత పత్రాలతో హాజరు కావచ్చని జిల్లా ఉపాధి అధికారిణి దీప్తి తెలియజేశారు.

# కలెక్టరేట్‌లో పరిపాలన వినాయకునికి ప్రత్యేక పూజలు

**వినాయక చవితి సందర్భంగా ప్రత్యేక పూజలు**

**జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పాల్గొనడం**

**డీఆర్వో సి. వెంకట నారాయణమ్మ హాజరు**

**కలెక్టరేట్‌లో భక్తిశ్రద్ధలతో పూజలు**

**పరిపాలన వినాయకునికి విశేష పూజా కార్యక్రమం**



**కర్నూలు, సెప్టెంబర్ 15 (కొత్తస్వరం) :**

కలెక్టరేట్‌లో ప్రతిష్ఠించిన పరిపాలన వినాయకునికి జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డీఆర్వో సి. వెంకట నారాయణమ్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధికారులు భక్తిశ్రద్ధలతో వినాయకునికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.


# పాదయాత్ర విజయవంతం కావాలని టీఆర్‌పీ నాయకుల పూజలు

**భద్రకాళి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు**

**మల్లన్న పాదయాత్రకు ఆటంకాలు లేకుండా సాగాలని ఆకాంక్ష**

**రాష్ట్ర నాయకుల ఆధ్వర్యంలో అర్చనలు, మొక్కులు**

**ప్రజా సమస్యల పరిష్కారమే పాదయాత్ర లక్ష్యమన్న పార్టీ శ్రేణులు**







**హన్మకొండ, సెప్టెంబర్ 15 (కొత్త స్వరం) :**

తెలంగాణ రాజ్యాధికార పార్టీ హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో హనుమకొండలోని ప్రసిద్ధ భద్రకాళి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సెప్టెంబర్ 17 నుంచి ప్రారంభం కానున్న తీన్మార్ మల్లన్న పాదయాత్ర ఎలాంటి ఆటంకాలు లేకుండా జయప్రదం కావాలని ఆకాంక్షిస్తూ ఈ పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి రాజ్యాధికార పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజినీకుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ పల్లె బోయిన అశోక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అమ్మవారికి ప్రత్యేక అర్చనలు నిర్వహించి, తీన్మార్ మల్లన్న చేపట్టనున్న పాదయాత్ర విజయవంతం కావాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం, ప్రజల్లో చైతన్యం నింపడమే పాదయాత్ర ఉద్దేశమని, దీనికి ప్రజల మద్దతు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పోలు రాజు, రాష్ట్ర కార్యదర్శి కడారి శ్రీనివాస్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పూజరి సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ పుట్ట రాజు, ఉపాధ్యక్షులు బాల్నే జగన్‌మోహన్, ముడిదే శ్రీనివాస్, గ్రేటర్ వరంగల్ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగిలి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి భద్రకాళి రమణ, వరంగల్ జిల్లా అధ్యక్షుడు పెండేల సంపత్, మహిళా అధ్యక్షురాలు బాల్నే లక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాధిక, మాధవి, రమణ, రజిత, అనిల్, నవీన్, రమేష్, పరమేశ్వర్, ఫర్హాత్, నహీదా, మహమ్మద్ ఇర్ఫాన్, స్వామి, రాజేష్, సంజీవ్, అశోక్ తదితరులతో పాటు వివిధ మండలాల అధ్యక్షులు, టీఆర్‌పీ నాయకులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి హామీల అమలుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి






**త్వరితగతిన హెచ్‌ఓడీలకు పంపాలి**

**ఆర్థిక వ్యయం అవసరమైన పనులకే ప్రతిపాదనలు**

**పనుల గ్రౌండింగ్‌లో జాప్యం వద్దు**

**ప్రతి దశను సమర్థవంతంగా పర్యవేక్షించాలి**

**నిర్దేశిత సమయంలో పనులు ప్రారంభించాలి**

**కర్నూలు, సెప్టెంబర్ 15 (కొత్త స్వరం) :**

రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల అమలుకు సంబంధించిన ప్రతిపాదనలను త్వరితగతిన సిద్ధం చేసి పంపించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం విజయవాడ నుంచి ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల అమలుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి హామీల అమలుకు సంబంధించి ఆయా శాఖల ప్రతిపాదనలను సంబంధిత హెచ్‌ఓడీలకు పంపించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఆర్థిక వ్యయం అవసరమయ్యే పనులకు మాత్రమే ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. ముఖ్యమంత్రి హామీల అమలులో ఎలాంటి జాప్యం లేకుండా ప్రతిపాదనల రూపకల్పన నుంచి పనుల గ్రౌండింగ్ వరకు ప్రతి దశను సమర్థవంతంగా పర్యవేక్షిస్తూ నిర్ణీత సమయంలో పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి మాట్లాడుతూ జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలయ్యే విధంగా ఆయా శాఖల అధికారులు త్వరితగతిన ప్రతిపాదనలు రూపొందించి హెచ్‌ఓడీలకు పంపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో సీపీఓ భారతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మనోహర్, ఆర్అండ్‌బీ ఎస్‌ఈ మహేశ్వరరెడ్డి, డ్వామా పీడీ నరసింహారెడ్డి, బీసీ సంక్షేమ అధికారి ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

# దేశ సేవ నుంచి ప్రజా సేవలోకి నరసింహ రాములు

**మల్లన్న సమక్షంలో టీఆర్పీలో చేరిక**

**30 ఏళ్ల పాటు భారత సైన్యంలో సేవలు**

**ముగ్గురు మాజీ రాష్ట్రపతులకు వైద్య సేవలు**

**పలు యుద్ధాల్లో సైనికులకు చికిత్స**

**బీసీ రాజ్యాధికార యాత్ర మెడికల్ టీమ్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (కొత్త స్వరం) :**

భారత సైన్యంలో 30 ఏళ్ల పాటు సుదీర్ఘ సేవలందించి, పలు యుద్ధాల్లో గాయపడిన సైనికులకు వైద్య సేవలు అందించిన రిటైర్డ్ సుబేదార్ మేజర్ నరసింహ రాములు ప్రజా జీవితంలోకి అడుగుపెట్టారు. మంగళవారం తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) కేంద్ర కార్యాలయంలో తీన్మార్ మల్లన్న సమక్షంలో ఆయన పార్టీలో చేరారు. కల్నల్ బిక్షపతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తీన్మార్ మల్లన్న నరసింహ రాములుకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. మిలిటరీ డెంటల్ కోర్‌లో సుబేదార్ మేజర్‌గా సేవలందించిన నరసింహ రాములు మాజీ రాష్ట్రపతులు ప్రణబ్ ముఖర్జీ, ప్రతిభా పాటిల్, రామ్‌నాథ్ కోవింద్‌లకు వ్యక్తిగత వైద్య సేవలు అందించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. దేశ సరిహద్దుల్లో జరిగిన పలు యుద్ధాల్లో పాల్గొని, గాయపడిన పలువురు సైనికులకు సకాలంలో వైద్యం అందించినట్లు పేర్కొన్నారు. పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన నరసింహ రాములు తీన్మార్ మల్లన్న ఆశయాలు, ప్రజా పోరాటాలకు ఆకర్షితులై టీఆర్పీలో చేరినట్లు తెలిపారు. సెప్టెంబర్ 17 నుంచి ప్రారంభం కానున్న మల్లన్న బీసీ రాజ్యాధికార యాత్రలో ఆయనను మెడికల్ టీమ్ ఇన్‌చార్జ్‌గా నియమించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నరసింహ రాములు మాట్లాడుతూ "ఆర్మీలో దేశానికి సేవ చేశాను, ఇప్పుడు తీన్మార్ మల్లన్న నాయకత్వంలో తెలంగాణ ప్రజలకు, నిరుపేదలకు సేవ చేయడానికి రాజకీయాల్లోకి వచ్చాను" అని అన్నారు. ఆయన చేరికతో పార్టీకి, ముఖ్యంగా ఆ ప్రాంతంలో మరింత బలం చేకూరిందని కల్నల్ బిక్షపతి, పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వేములవాడ మదనమోహన చారి, రాష్ట్ర నాయకులు పిట్టల శంకర్, జనగామ జిల్లా అధ్యక్షుడు కట్ల సదానందం, రాష్ట్ర మైనార్టీ అధ్యక్షుడు సల్మాన్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పిట్టల సురేష్, జిల్లా నాయకులు బబ్బులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# మల్లన్నకు బీసీ ఉద్యోగ సంఘాల మద్దతు





**తీన్మార్ మల్లన్నను కలిసిన బీసీ ఉద్యోగ సంఘాల నేతలు**

**బీసీ రాజ్యాధికార యాత్రకు సంపూర్ణ మద్దతు**

**చట్టసభల్లో బీసీల హక్కులపై గళమెత్తారని ప్రశంస**

**బీసీ రాజ్యం సాధించే వరకు పోరాటం కొనసాగించాలని విజ్ఞప్తి**

**రెండు రాష్ట్రాల బీసీ ఉద్యోగ సంఘాలు అండగా ఉంటాయని వెల్లడి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (కొత్త స్వరం) :**

బీసీలకు రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా తీన్మార్ మల్లన్న సాగిస్తున్న పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలుగు రాష్ట్రాల బీసీ ఉద్యోగుల సంఘాల నాయకులు తెలిపారు. బీసీ ఉద్యోగుల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు పరమేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు చింత నాగరాజు ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘం ప్రతినిధులు మంగళవారం టీఆర్పీ కేంద్ర కార్యాలయంలో తీన్మార్ మల్లన్నను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ శాసనమండలిలో బీసీల హక్కులు, సంక్షేమం కోసం మల్లన్న గళమెత్తిన తీరు అభినందనీయమన్నారు. దేశ చరిత్రలో ఇప్పటివరకు ఏ నాయకుడు చట్టసభల్లో బీసీల హక్కుల కోసం ఈ స్థాయిలో పట్టుబట్టలేదని వారు పేర్కొన్నారు. బీసీల ఆత్మగౌరవం, హక్కులపై చట్టసభల్లో ప్రసంగించిన మల్లన్నకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. మల్లన్న నేతృత్వంలో సెప్టెంబర్ 17 నుంచి సాగనున్న బీసీ రాజ్యాధికార యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. బడుగు, బలహీన వర్గాలకు చట్టసభల్లో సరైన ప్రాతినిధ్యం లభించి, బీసీ రాజ్యం స్థాపించే వరకు పోరాటాన్ని కొనసాగించాలని మల్లన్నకు విజ్ఞప్తి చేశారు. మల్లన్న చేపట్టే కార్యక్రమాల్లో రెండు రాష్ట్రాల బీసీ ఉద్యోగ సంఘాలు సైనికుల్లా అండగా నిలుస్తాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఈ ఆంజనేయులు, పాలిటెక్నిక్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్ కుమార్, బీసీ ప్రతినిధులు గిరిరాజ్ రవి శంకర్, యుగంధర్, శ్రీనివాస్, కిరణ్ కుమార్ తదితర ఉద్యోగ, సామాజిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# కొండా సురేఖ తొలగింపు బాధాకరం: మహేశ్‌కుమార్ గౌడ్

**పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనతోనే ఏఐసీసీ చర్య**

**పార్టీ హద్దులు దాటితే చర్యలు తప్పవని స్పష్టీకరణ**

**సీఎం రేవంత్‌రెడ్డితో విభేదాలు లేవన్న టీపీసీసీ చీఫ్**

**పార్టీ, ప్రభుత్వాన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళ్తున్నామని వెల్లడి**

**అంతర్గత సమస్యలను పార్టీ వేదికలపైనే చర్చించాలని సూచన**

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (కొత్త స్వరం) :**

కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడం బాధాకరమేనని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. అయితే పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించినందుకే ఏఐసీసీ ఈ నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు. పార్టీ నిర్దేశించిన హద్దులు దాటితే ఎంతటివారిపైనైనా చర్యలు తప్పవని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లో మంగళవారం మీడియాతో అనధికారికంగా మాట్లాడిన మహేశ్‌కుమార్ గౌడ్ పార్టీ అంతర్గత వ్యవహారాలు, ఇటీవలి పరిణామాలపై స్పందించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, తనకు మధ్య ఎలాంటి విభేదాలు లేవని, పార్టీని ప్రభుత్వాన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. పార్టీ క్రమశిక్షణే అత్యంత ప్రధానమని, ఏఐసీసీ నిర్దేశించిన హద్దులు, పార్టీ లైన్‌ను దాటితే చర్యలు తప్పవని అన్నారు. పార్టీలో ఏవైనా సమస్యలు ఉంటే అంతర్గత వేదికలపైనే చర్చించుకోవాలని, వాటిని బహిరంగంగా మాట్లాడి క్రమశిక్షణ ఉల్లంఘిస్తే అధిష్ఠానం ఉపేక్షించదని స్పష్టం చేశారు. కొండా సురేఖపై చర్య పార్టీ క్రమశిక్షణకు సంబంధించిన అంశమని, పార్టీ క్రమశిక్షణా కమిటీ నివేదిక ఆధారంగా ఏఐసీసీ నిర్ణయం తీసుకున్నట్లు గతంలోనూ మహేశ్‌కుమార్ గౌడ్ వెల్లడించారు. రేవంత్‌రెడ్డితో కలిసి ప్రజా సంక్షేమం, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం పనిచేయడమే తమ లక్ష్యమని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. తమ మధ్య గ్యాప్ ఉందంటూ జరుగుతున్న ప్రచారాన్ని నమ్మవద్దని కోరారు. కాంగ్రెస్ కార్యకర్తల కష్టంతోనే తెలంగాణలో పార్టీ అధికారంలోకి వచ్చిందని, సాధారణ కార్యకర్తలకు కూడా పార్టీలో కీలక పదవులు లభిస్తున్నాయని చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి ఒక్కరినీ గుర్తిస్తామని, పార్టీ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నేతలు, కార్యకర్తలు క్రమశిక్షణతో పనిచేయాలని మహేశ్‌కుమార్ గౌడ్ సూచించారు.

# ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు గడువు పొడిగింపు

**సెప్టెంబర్ 18 వరకు దరఖాస్తులకు అవకాశం**

**అర్హులందరికీ అవకాశం కల్పించేందుకే నిర్ణయం**

**వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలి**

**స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల్లో దరఖాస్తుల స్వీకరణ**

**రాష్ట్రంలో 62 లక్షల మందికి పింఛన్లు**

**అమరావతి, సెప్టెంబర్ 15 (కొత్త స్వరం) :**

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల దరఖాస్తుల గడువును రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 18 వరకు పొడిగించింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించేందుకే మరో రెండు రోజులు గడువు పెంచినట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. గతంలో సెప్టెంబర్ 7 నుంచి 16వ తేదీ వరకు ఉన్న దరఖాస్తుల గడువును 18వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు సహా అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని దరఖాస్తు చేసుకోవాలని కోరారు. స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల్లో దరఖాస్తుల స్వీకరణతో పాటు ఈ–కేవైసీకి పూర్తి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు నమోదు అనంతరం అక్నాలెడ్జ్‌మెంట్ పత్రాన్ని అందజేస్తారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఎన్టీఆర్ భరోసా ద్వారా 62 లక్షల మందికి పింఛన్లు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ గడువు పొడిగింపు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# టీఆర్పీలోకి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల చేరికలు


**కల్వకుర్తి, అచ్చంపేట నుంచి పలువురు చేరిక**

**తీన్మార్ మల్లన్న సమక్షంలో పార్టీలోకి ఆహ్వానం**

**కొత్త మండల అధ్యక్షులకు నియామక పత్రాలు**

**బీసీల రాజ్యాధికారమే లక్ష్యమన్న మల్లన్న**

**సెప్టెంబర్ 17న బీసీ రాజ్యాధికార యాత్ర**



**నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 15 (కొత్త స్వరం) :**

నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరారు. టీఆర్పీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సమక్షంలో మంగళవారం ఈ చేరికల కార్యక్రమం జరిగింది. జిల్లా అధ్యక్షుడు బీసం ఆంజనేయులు ఆధ్వర్యంలో కల్వకుర్తి, అచ్చంపేట నియోజకవర్గాలకు చెందిన గాడిగా ఈశ్వర్ గౌడ్, వడ్డెమన్ నాగరాజు, చెనరెడ్డి సతీష్, నడింపల్లి అమరేందర్ గౌడ్, ముద్దామోలా నిరంజన్, మద్దునాగుల రమేష్, ఆవుల పర్వతమ్మ, అతినారపు అనురాధ, కౌకుంట్ల వెంకటయ్య, నీలమ్మ, శివలీల, లక్ష్మి, సుశీల, రాధ, మాధవి, కొండమ్మ, పుష్పలత, రాములు, పర్వతాలు, సైదన్న, కుర్మయ్య తదితరులు టీఆర్పీలో చేరారు. వారికి పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం నూతన మండల అధ్యక్షుల నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ తెలంగాణలో బీసీల రాజ్యాధికారమే లక్ష్యంగా టీఆర్పీ ముందుకు సాగుతోందన్నారు. సెప్టెంబర్ 17న నిర్వహించ తలపెట్టిన 'బీసీ రాజ్యాధికార యాత్ర'కు జిల్లా ప్రజలు, బహుజన శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో జిల్లాలో మరిన్ని చేరికలు ఉంటాయని జిల్లా అధ్యక్షుడు బీసం ఆంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ నారముని నరేష్ యాదవ్, మహిళా అధ్యక్షురాలు తవిటి శైలజ, లింగాల మండల అధ్యక్షుడు ఆవుల యాదగిరి పాల్గొన్నారు.

# టీఆర్పీలోకి జనగామ జిల్లా నుంచి భారీ చేరికలు


**పార్టీలో చేరిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు**

**కండువా కప్పి ఆహ్వానించిన తీన్మార్ మల్లన్న**

**మైనారిటీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అక్తర్ పాషా**

**బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు రాజ్యాధికారమే లక్ష్యం**

**ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా టీఆర్పీ ఎదుగుతోందన్న మల్లన్న**






**జనగామ, సెప్టెంబర్ 15 (కొత్త స్వరం) :**

తెలంగాణ రాజ్యాధికార పార్టీలో జనగామ జిల్లాకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో చేరారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో టీఆర్పీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలకు రాజ్యాధికారం సాధించడమే టీఆర్పీ లక్ష్యమని తీన్మార్ మల్లన్న పేర్కొన్నారు. తెలంగాణలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా టీఆర్పీ ఎదుగుతోందని, పార్టీ ఆశయాలకు ఆకర్షితులై పెద్ద ఎత్తున ప్రజలు పార్టీలో చేరుతున్నారని అన్నారు. మైనారిటీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సల్మాన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మైనారిటీ వర్గాలకు చెందిన పలువురు నాయకులు, యువకులు పార్టీలో చేరారు. ఇదే కార్యక్రమంలో ఎండీ అక్తర్ పాషాను టీఆర్పీ మైనారిటీ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమిస్తూ తీన్మార్ మల్లన్న నియామక పత్రాన్ని అందజేశారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు మైనారిటీ వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అక్తర్ పాషాకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బంధారపు నర్సయ్య గౌడ్, స్టేట్ ఆఫీస్ కోఆర్డినేటర్ లింగం యాదవ్, మైనారిటీ విభాగం ప్రతినిధులు, జనగామ జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని హఠాన్మరణం

**గుండెపోటుతో విశాఖలో కన్నుమూసిన ఆళ్ల నాని**
**56 ఏళ్ల వయసులోనే ఆకస్మిక మృతి**
**మూడుసార్లు ఏలూరు ఎమ్మెల్యేగా సేవలు**
**డిప్యూటీ సీఎంగా, వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు**
**నాని మృతిపై రాజకీయ నేతల సంతాపం**

**ఏలూరు, సెప్టెంబర్ 16 (కొత్త స్వరం) :**

ఆంధ్రప్రదేశ్ మాజీ ఉప ముఖ్యమంత్రి, టీడీపీ నాయకుడు ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (ఆళ్ల నాని) గుండెపోటుతో మృతి చెందారు. మంగళవారం విశాఖపట్నంలోని తన నివాసంలో ఆయనకు గుండెపోటు రావడంతో ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆయన మృతి వార్తతో ఏలూరు నియోజకవర్గంతో పాటు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో విషాదం నెలకొంది. ఆళ్ల నాని 1969 డిసెంబర్ 30న ఏలూరులోని శనివారపుపేటలో జన్మించారు. ఏలూరులో విద్యాభ్యాసం పూర్తి చేసిన ఆయన కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2004లో తొలిసారిగా ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2009లోనూ అదే నియోజకవర్గం నుంచి గెలుపొందారు. 2013లో కాంగ్రెస్‌ను వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2017లో ఎమ్మెల్సీగా ఎన్నికైన ఆయన 2019లో ఏలూరు నుంచి మళ్లీ ఎమ్మెల్యేగా గెలిచారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా, వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 2024 ఎన్నికల అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడిన ఆయన 2025లో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆయన ఆకస్మిక మృతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి నారా లోకేశ్ తదితరులు సంతాపం తెలిపారు. ఆళ్ల నాని భౌతికకాయాన్ని ఏలూరుకు తరలించగా కుటుంబ సభ్యులు, అనుచరులు, అభిమానులు పెద్ద సంఖ్యలో నివాళు లర్పించారు. ఆయనకు భార్య రేఖ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

# ఏపీలో స్థానిక ఎన్నికలకు వేగం

**41 పట్టణ స్థానిక సంస్థలకు ఓటర్ల జాబితాల తయారీ**
**సెప్టెంబర్ 22న ఫొటో ఓటర్ల జాబితాల ప్రచురణ**
**జనవరి 1, 2026 అర్హత తేదీగా నిర్ణయం**
**12 కార్పొరేషన్లు, 29 మున్సిపాలిటీలు పరిధిలోకి**
**మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో మరో కీలక అడుగు**

**అమరావతి, సెప్టెంబర్ 16 (కొత్త స్వరం) :**

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తును వేగవంతం చేసింది. మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా తాజాగా 41 పట్టణ స్థానిక సంస్థలకు వార్డుల వారీగా ఫొటో ఓటర్ల జాబితాలను సిద్ధం చేసి ప్రచురించాలని ఎస్ఈసీ ఆదేశాలు జారీ చేసింది. ఈ పరిధిలో 12 మున్సిపల్ కార్పొరేషన్లు, 29 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు ఉన్నాయి. ఆయా పట్టణ స్థానిక సంస్థల్లో ఓటర్ల జాబితాల తయారీ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ఆదేశించిన ఎస్ఈసీ, తాజా అసెంబ్లీ ఓటర్ల జాబితాను ప్రామాణికంగా తీసుకోవాలని సూచించింది. 2026 జనవరి 1వ తేదీని అర్హత తేదీగా నిర్ణయించి, ఆ తేదీ నాటికి ఓటు హక్కు కలిగిన వారి వివరాలతో జాబితాలను రూపొందించనున్నారు. ఈ ప్రక్రియను పూర్తి చేసి సెప్టెంబర్ 22న తుది ఫొటో ఓటర్ల జాబితాలను ప్రచురించనున్నట్లు ఎన్నికల సంఘం పేర్కొంది. ఇప్పటికే 59 పట్టణ స్థానిక సంస్థల్లోనూ ఎన్నికల సన్నాహక చర్యలు కొనసాగుతున్నాయి.



# పోలీసుల ఎదుట విచారణకు హాజరైన యూట్యూబర్ నందన

**గడువుకు ఒకరోజు ముందే విచారణకు హాజరు**
**మూడు గంటల పాటు 20 ప్రశ్నలతో విచారణ**
**కన్సల్టెన్సీ వ్యవహారాలతో తనకు సంబంధం లేదన్న నందన**
**లుక్‌అవుట్ నోటీసులు ఉపసంహరించాలని విజ్ఞప్తి**
**విదేశీ ఉద్యోగాల పేరుతో మోసం ఆరోపణలపై కేసు**

**విజయవాడ, సెప్టెంబర్ 15 (కొత్త స్వరం) :**

విదేశీ ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న యూట్యూబర్ నందన గడువుకు ఒకరోజు ముందే మరోసారి పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం న్యాయవాదులతో కలిసి వచ్చిన ఆమెను పోలీసులు సుమారు మూడు గంటల పాటు విచారించారు. సెప్టెంబర్ 16వ తేదీలోగా విచారణకు హాజరుకావాలని పోలీసులు నోటీసులు ఇవ్వగా, ఒకరోజు ముందుగానే ఆమె హాజరయ్యారు. విచారణలో పోలీసులు 20 ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. కన్సల్టెన్సీ వ్యవహారాలన్నీ తన భర్త పర్యవేక్షించేవారని, ఆ లావాదేవీలతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆమె పోలీసులకు తెలిపినట్లు తెలుస్తోంది. తనపై జారీ చేసిన లుక్‌అవుట్ నోటీసులను ఉపసంహరించాలని కోరిన నందన, విచారణకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఆమె విజ్ఞప్తిని పరిశీలిస్తామని పోలీసులు తెలిపారు. విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నందన, ఆమె భర్త పలువురి నుంచి డబ్బులు తీసుకుని మోసం చేశారనే ఆరోపణలపై బాధితుల ఫిర్యాదుతో ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం వారిపై లుక్‌అవుట్ సర్క్యులర్ జారీ చేశారు. ఇటీవల విదేశాల నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న నందనను ఇమ్మిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకుని, ఎల్ఓసీ ఉన్నట్లు గుర్తించి ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. అక్కడ ప్రాథమిక విచారణ అనంతరం మరోసారి హాజరు కావాలని నోటీసులు ఇవ్వడంతో తాజాగా ఆమె విచారణకు హాజరయ్యారు.



# నిరుద్యోగుల అవకాశాలపై సాక్షి విషం చిమ్ముతోంది

**ఉద్యోగాలు ఇవ్వడం మా విధానం.. ఉద్యోగాలకు అడ్డుపడటం వైసీపీ విధానం**
**మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**అమరావతి, సెప్టెంబర్ 15 (కొత్త స్వరం):**

నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు వస్తుంటే చూసి ఓర్వలేక, వారి అవకాశాలపై కూడా విషం చిమ్మే స్థాయికి వైసీపీ, దాని కరపత్రం 'సాక్షి' దిగజారాయని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క వెటర్నరీ డాక్టర్ పోస్టును కూడా భర్తీ చేయకుండా నిరుద్యోగులను రోడ్లపై తిప్పిన వారు, కూటమి ప్రభుత్వం 160 పోస్టుల భర్తీకి ముందుకొస్తే ఇప్పుడు నీతులు చెబుతున్నారని ధ్వజమెత్తారు. ఉద్యోగం ఇవ్వరు... ఇచ్చేవారిని ఇవ్వనివ్వరు... నియామకాలు చేపడితే అనుమానాలు సృష్టిస్తారు... ఇదే వైసీపీ, సాక్షి మార్కు నిరుద్యోగ వ్యతిరేక రాజకీయం అని మంత్రి వ్యాఖ్యానించారు.

**అభ్యర్థులే కోరారు.. ప్రభుత్వం మానవీయంగా స్పందించింది**

జాబ్ క్యాలెండర్‌లో భాగంగా జీఓఎంఎస్ నెం. 21 ద్వారా ఈ పోస్టులను ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని ప్రభుత్వం తొలుత నిర్ణయించిందని మంత్రి వివరించారు. అయితే గత ఎనిమిదేళ్లుగా నియామకాలు జరగలేదని, ఇప్పుడు అకస్మాత్తుగా పరీక్షా విధానం తీసుకొస్తే ఇన్నేళ్లుగా ఎదురుచూస్తున్న అభ్యర్థులు నష్టపోతారని వెటర్నరీ నిరుద్యోగుల సంఘమే ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిందన్నారు. కనీసం ఈ ఒక్కసారికి పాత వెయిటేజీ విధానాన్ని కొనసాగించాలని వారు కోరారని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖలోనూ వెయిటేజీ విధానం అమలులో ఉండటం, అభ్యర్థుల విజ్ఞప్తిలో న్యాయం ఉండటంతో ప్రభుత్వం అన్ని అంశాలను పరిశీలించి జీఓఎంఎస్ నెం. 52 ప్రకారం పరీక్ష లేకుండా మెరిట్, వెయిటేజీ ఆధారంగా నియామకాలు నిర్వహించాలని ఏపీపీఎస్సీని కోరిందని మంత్రి తెలిపారు. అయితే ప్రస్తుత పని ఒత్తిడి, పరీక్ష లేకుండా వెయిటేజీ విధానంలో నియామకాలు చేపట్టేందుకు అవసరమైన సమయం లేకపోవడంతో ఈ ప్రక్రియను నిర్వహించలేమని ఏపీపీఎస్సీ తెలియజేసిందన్నారు. అందుకే జీఓఎంఎస్ నెం.22 ద్వారా ఈ ఒక్కసారికి మాత్రమే పాత విధానంలో పశుసంవర్ధక శాఖ ద్వారా నియామకాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని స్పష్టం చేశారు. ఇక్కడ దాచింది ఏముంది? రహస్యం ఏముంది? ప్రభుత్వం జారీ చేసిన జీవోలోనే 'ఈ ఒక్కసారికి మాత్రమే' అని స్పష్టంగా ఉంది. భవిష్యత్ నియామకాలను ఏపీపీఎస్సీ ద్వారా పరీక్షా విధానంలో నిర్వహిస్తామని కూడా స్పష్టంగా పేర్కొన్నాం అని మంత్రి పేర్కొన్నారు.

# ఇంజనీర్ల సేవలు దేశ నిర్మాణంలో అత్యంత కీలకం

**ఇంజనీర్స్ డే సందర్భంగా**
**మంత్రి నిమ్మల రామానాయుడు శుభాకాంక్షలు**

**అమరావతి, సెప్టెంబర్ 15 (కొత్త స్వరం):**

ఇంజనీర్స్ డే సందర్భంగా రాష్ట్రంలోని ఇంజనీర్లందరికీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మహోన్నత ఇంజనీర్, భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఆయన దేశానికి, అందించిన సేవలను స్మరించుకోవాలని మంత్రి పేర్కొన్నారు. దేశ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర అత్యంత కీలకమని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం, క్రమశిక్షణ, నిబద్ధతతో ఇంజనీర్లు దేశ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో గతంలో నిలిచిపోయిన సాగునీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. పోలవరం, వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ, హంద్రీ–నీవా వంటి దశాబ్దాల కలల ప్రాజెక్టుల పురోగతిలో ఇంజనీర్ల కృషి ప్రశంసనీయమని అన్నారు. సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చూపిన క్రమశిక్షణ, నిబద్ధత, సాంకేతిక నైపుణ్యం నేటి ఇంజనీర్లకు ఆదర్శమని మంత్రి పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తితో ఇంజనీర్లు సాంకేతికతను ప్రజా ప్రయోజనాలకు మరింత విస్తృతంగా వినియోగించాలని ఆకాంక్షించారు. ఇంజనీర్ల విజ్ఞానం రాష్ట్ర ప్రగతికి బలమని, వారి నైపుణ్యం జలవనరుల అభివృద్ధికి వెన్నెముక వంటిదని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, సాగునీరు, తాగునీరు అందించేందుకు ఇంజనీర్లు మరింత అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. ఇంజనీర్స్ డే సందర్భంగా రాష్ట్రంలోని ఇంజనీర్లందరికీ మరోసారి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి సేవలు రాష్ట్రాభివృద్ధికి మరింతగా దోహదపడాలని మంత్రి నిమ్మల రామానాయుడు ఆకాంక్షించారు.

# విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఘన నివాళి

**దేశ నిర్మాణంలో ఆయన సేవలు చిరస్మరణీయం**
**మంత్రి సత్యకుమార్ యాదవ్**

భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ ఘన నివాళులర్పించారు. ఇంజినీరింగ్ రంగానికి, దేశ నిర్మాణానికి ఆయన చేసిన విశిష్ట సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.ఇంజినీర్ల సేవలు దేశ ప్రగతికి కీలకంఇంజినీర్ల విజ్ఞానం, కొత్త ఆలోచనలు, అంకితభావం దేశ అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తున్నాయని మంత్రి అన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో ఇంజినీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.విశ్వేశ్వరయ్య జీవితం స్ఫూర్తిదాయకంసర్ ఎం. విశ్వేశ్వరయ్య చూపిన దూరదృష్టి, క్రమశిక్షణ, అంకితభావం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని మంత్రి తెలిపారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశ పురోగతికి ఇంజినీర్లు మరింతగా సేవలందించాలని ఆకాంక్షించారు.

# వన సంరక్షణ సమితిలో జరిగిన అక్రమాలపై న్యాయ విచారణ జరపాలి

**ఏలూరు జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా**

**ఏలూరు, సెప్టెంబరు 15 (కొత్త స్వరం) :**

చింతలపూడి నియోజకవర్గం లింగపాలెం గ్రామం లో వన సంరక్షణ సమితిలో జరిగిన అక్రమాలపై న్యాయ విచారణ జరిపి వి ఎస్ ఎస్ సభ్యులకు న్యాయం చేయాలని అఖిల భారత రైతుకూలి సంఘం,,సి పి ఐ ఎమ్ ఎల్ న్యూ డెమోక్రసి ఆద్వర్యం లో కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది, ఈ ధర్నాలో సి ఐ ఎమ్ ఎల్ న్యూ డెమోక్రసి నాయకులు తలారి ప్రకాష్, చేబతిన వెంకటరత్నం తో బస్తు వేములపల్లి వి ఎస్ ఎస్ సభ్యులు పాల్గొన్నారు

# ఇంజనీర్ల ఆలోచనలు... దేశ ప్రగతికి పునాదులు

**ఏపీసీపీడీసిఎల్ సీఎండీ పుల్లారెడ్డి**

**విజయవాడ, సెప్టెంబర్ 15 (కొత్త స్వరం):**

భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజనీర్స్ డే వేడుకలను విజయవాడలోని ఏపీసీపీడీసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ పుల్లారెడ్డి, మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. విద్యుత్ రంగంలో ఇంజనీర్లు అందిస్తున్న సేవల విషయంలో విద్యుత్ సరఫరా, నాణ్యమైన సేవలు, సాంకేతిక అభివృద్ధి, విద్యుత్ వ్యవస్థ ఆధునీకరణలో ఇంజనీర్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నూతన ఆవిష్కరణలను స్వీకరిస్తూ విద్యుత్ రంగాన్ని మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు విద్యుత్ భద్రత, సరఫరా నాణ్యత, అంతరాయాల నివారణకు ఇంజనీర్లు మరింత అంకితభావంతో పనిచేయాలని సూచించారు.సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య క్రమశిక్షణ, నిజాయితీ, సాంకేతిక నైపుణ్యం, దేశ సేవా స్ఫూర్తి ప్రతి ఇంజనీర్‌కు ఆదర్శమని పేర్కొన్నారు."ఇంజనీర్ల ఆలోచనలు ? దేశ ప్రగతికి పునాదులు" అనే స్ఫూర్తితో విద్యుత్ రంగ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# రాజకీయ ప్రేరేపిత చర్యలకు కోచింగ్ కేంద్రాలు వేదికలు కావొద్దు

## జీవో నెంబరు 9 మార్గదర్శకాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు

## అధికారులకు ఆదేశాలు జారీ చేసిన సీఎం చంద్రబాబు

**అమరావతి, సెప్టెంబరు 15 (కొత్త స్వరం):**

రాష్ట్రంలోని కొన్ని ప్రైవేటు కోచింగ్ కేంద్రాలు నిబంధనల ఉల్లంఘనకు పాల్పడుతున్నట్టు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. రాజకీయాలకు, రాజకీయ కుట్రలకు ఈ ప్రైవేటు కోచింగ్ కేంద్రాలు వేదిక కాకూడదని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలతో ఈ అంశంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రభుత్వంపై బురద జల్లేందుకు కొందరు ఈ ప్రైవేటు కోచింగ్ కేంద్రాలపై ఒత్తిడి తెస్తున్నట్టు గుర్తించారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో సమీక్ష నిర్వహించారు. నిబంధనలకు వ్యతిరేకంగా కొన్ని కోచింగ్ సెంటర్లు వ్యవహరిస్తున్న తీరుపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దురుద్దేశ పూర్వకంగా కొన్ని ప్రైవేటు కోచింగ్ కేంద్రాలు తమ వద్ద పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న అభ్యర్థులపై ఒత్తిడి తెచ్చి ఈ తరహా ఆందోళనలకు, నిరసనలకు పాల్పడేలా చేస్తున్నట్టు అధికారులు వివరించారు. పోటీ పరీక్షలకు సిద్ధం చేయాల్సిన అభ్యర్థులను రాజకీయ ప్రేరేపిత నిరసనలు, ఆందోళనలకు వినియోగిస్తున్నట్టు తెలిపారు. తమ స్వార్థ ప్రయోజనాల కోసమే కొన్ని ప్రైవేటు కోచింగ్ సంస్థల యజమానులు దురుద్దేశంతో అభ్యర్థులను నిరసనలకు, ఆందోళనల కోసం ప్రోత్సహించినట్టు తేలిందన్నారు. ఈ అంశాలపై దృష్టి సారించిన సీఎం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించటంపై చర్యలు తీసుకోవాలని సూచనలు జారీ చేశారు. ప్రైవేటు కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా అభ్యర్థులను రాజకీయ కుట్రల్లో భాగస్వాములను చేస్తే సహించబోమని ప్రభుత్వం స్పష్టం చేసింది. వివిధ పోటీ పరీక్షలకు అభ్యర్థులను సిద్ధం చేయాల్సిన ఈ కోచింగ్ కేంద్రాలు కొందరు అభ్యర్థులను రాజకీయ పరమైన ఆందోళనలు, నిరసనల్లో పాల్గొనేలా ప్రేరేపిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ఆంధ్రప్రదేశ్ కోచింగ్ సంస్థల నియంత్రణా నిబంధనలు 2026 ప్రకారం ప్రైవేటు కోచింగ్ కేంద్రాలు జీవో నెంబర్ 9 లోని మార్గదర్శకాలకు అనుగుణంగా నడచుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీనికి విరుద్ధంగా వ్యవహరించిన ప్రైవేటు కోచింగ్ కేంద్రాలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. ఈమేరకు క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం ప్రైవేటు కోచింగ్ కేంద్రాలు మార్గదర్శకాలను పాటించేలా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. అటు అభ్యర్థులు కూడా ఎలాంటి ఒత్తిళ్లకూ లోను కాకుండా తమ భవిష్యత్తుపై, పోటీ పరీక్షలపై దృష్టి సారించాలని ప్రభుత్వం పేర్కొంది. ఈ వ్యవహారంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తేవాలని సూచనలు జారీ చేసింది.

# అక్రమ సస్పెన్షన్ ను తక్షణమే రద్దు చేయాలి

**ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా**

**ఏలూరు, సెప్టెంబర్ 15 (కొత్త స్వరం):**

జంగారెడ్డిగూడెం ఆర్టిసి డిపోలో పనిచేస్తున్న డ్రైవర్ బి రామారావు అక్రమ సస్పెన్షన్ ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఏలూరు రీజినల్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద మంగళవారం నాడు ధర్నా జరిగింది. ఆర్టీసీ డ్రైవర్ కు సంబంధం లేకపోయినా తొమ్మిది రోజుల క్రితం జంగారెడ్డిగూడెం డిపోలో పనిచేస్తున్న డ్రైవర్ రామారావుని సస్పెండ్ చేయటం సరైనది కాదని ఎంప్లాయిస్ యూనియన్ విజయవాడ జోనల్ సెక్రెటరీ వై శ్రీనివాసరావు పేర్కొన్నారు. 1/2019 సెల్యులర్ ఉన్నప్పటికీ దాన్ని అమలు చేయకుండా ఆర్టీసీ అధికారులు రామారావుని సస్పెండ్ చేయడం చాలా దారుణమని ఆయన పేర్కొన్నారు, ఆర్టీసీ ఉన్నత అధికారులు తక్షణం స్పందించి రామారావు సస్పెన్షన్ రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సస్పెన్షన్ ఆర్డర్ను రద్దు చేయకపోతే ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు. ధర్నా కార్యక్రమానికి ఎంప్లాయిస్ యూనియన్ ఏలూరు రీజినల్ అధ్యక్షులు కొలుసు వీర రాఘవులు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి బి రాంబాబు, జంగారెడ్డి గూడెం సెక్రెటరీ కె ఎన్ ఎం రావు, నూజివీడు సెక్రెటరీ ఈ వి కుమార్ ఏలూరు సెక్రెటరీ డి ఆంజనేయులు తదితరులు మాట్లాడారు. ఆర్టీసీ ఏలూరు రీజినల్ డి పి టి ఓ షబ్నం కు యూనియన్ నాయకులు వినతి పత్రం సమర్పించి, రామారావు సస్పెన్షన్ రద్దు చేయమని కోరారు. డి పి టి ఓ మాట్లాడుతూ రామారావుని రిమూవ్ చేస్తామని చెప్పారని నాయకులు తెలిపారు. సస్పెన్షన్ రద్దు చేయకుండా రిమూవ్ చేస్తే బుధవారం నుండి కలెక్టర్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపడతామని నాయకులు డి పి టి ఓ కి తెలిపారు.ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయం కపర్థి భవన్ నుండి ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు ప్రదర్శనగా గ్యారేజ్ మీదుగా జిల్లా పరిషత్ కార్యాలయం నుండి కలెక్టరేట్ వరకు సాగింది.

# సుద్దాలకు 'తెలంగాణ తెలుగు తేజం' పురస్కారం

**సుద్దాల అశోక్ తేజకు మరో ప్రతిష్ఠాత్మక గౌరవం**
**ఈనెల 22న కరీంనగర్‌లో పురస్కారం ప్రదానం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 12(కొత్త స్వరం):**

తెలుగు సాహిత్య రంగంలో ప్రముఖ కవి, జాతీయ స్థాయి సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజకు మరో ప్రతిష్ఠాత్మక గౌరవం దక్కింది. బుర్ర నర్సమ్మ–లింగారెడ్డి స్మారక తెలంగాణ తెలుగు తేజం సాహిత్య పురస్కారం–2026కు ఆయనను ఎంపిక చేశారు. తెలుగు భాషా సంరక్షణ సంఘం–తెలంగాణ సాహితీ సంస్థ ఏటా ప్రదానం చేస్తున్న ఈ రాష్ట్ర స్థాయి పురస్కారానికి ఈసారి సుద్దాల అశోక్ తేజను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. పురస్కార కమిటీ ఛైర్మన్, అవార్డు వ్యవస్థాపకుడు కెప్టెన్ డా. బుర్ర మధుసూదన్‌రెడ్డి, తెలుగు భాషా సంరక్షణ సంఘం–తెలంగాణ సాహితీ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు దాస్యం సేనాధిపతి శుక్రవారం ఈ విషయాన్ని ప్రకటించారు. తెలుగు భాష, సాహిత్యానికి విశేష సేవలు అందిస్తున్న వారిని గుర్తించి గౌరవించాలనే ఉద్దేశంతో తెలంగాణ తెలుగు తేజం పురస్కారాన్ని ఏటా అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కవిగా, సినీ గేయ రచయితగా సుద్దాల అశోక్ తేజ తెలుగు భాషకు విశిష్టమైన సేవలు అందిస్తున్నారని నిర్వాహకులు పేర్కొన్నారు. ముఖ్యంగా తెలంగాణ భాష, యాస, సంస్కృతి, సామాజిక జీవనాన్ని ప్రతిబింబించే సాహిత్య, సినీ రచనలతో ఆయనకు ప్రత్యేక గుర్తింపు లభించింది. తెలంగాణ తెలుగు తేజం సాహిత్య పురస్కార ప్రదానోత్సవాన్ని ఈ నెల 22వ తేదీన కరీంనగర్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సుద్దాల అశోక్ తేజకు పురస్కారాన్ని అందజేయనున్నారు. తెలుగు భాషకు తెలంగాణ మట్టిబిడ్డలు అందించిన అమూల్యమైన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందిస్తున్నట్లు పురస్కార కమిటీ ప్రతినిధులు తెలిపారు. భాషా పరిరక్షణ, సాహిత్య అభివృద్ధికి కృషి చేస్తున్న రచయితలు, కవులు, సాహితీవేత్తలను ప్రోత్సహించడంలో భాగంగా ఈ పురస్కారాన్ని కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. సుద్దాల అశోక్ తేజ తెలుగు సాహిత్యంతో పాటు సినీ గేయ రచయితగా కూడా తనదైన ముద్ర వేశారు. సామాజిక అంశాలు, తెలంగాణ జీవన విధానం, ప్రజల భావోద్వేగాలను ప్రతిబింబించే అనేక రచనలకు ఆయన కలం అందించారు. ఆయన సాహిత్య, సినీ ప్రస్థానాన్ని గుర్తిస్తూ తెలంగాణ తెలుగు తేజం పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కరీంనగర్‌లో ఈ నెల 22వ తేదీన జరగనున్న పురస్కార ప్రదానోత్సవంతో సుద్దాల అశోక్ తేజకు ఈ గౌరవం అధికారికంగా అందనుంది. ఈ కార్యక్రమానికి సాహితీవేత్తలు, భాషాభిమానులు, సాంస్కృతిక రంగానికి చెందిన ప్రముఖులు హాజరయ్యే అవకాశం ఉంది.

# ఒక్క క్లిక్‌తో పలు రకాల సేవలు

**అందుబాటులోకి హైడ్రా వెబ్‌సైట్..**

**హైదరాబాద్, సెప్టెంబర్ 12(కొత్త స్వరం):**

హైదరాబాద్ నగరంలో విపత్తు నిర్వహణ, చెరువుల పరిరక్షణ, ఆస్తుల రక్షణకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు హైడ్రా కీలక అడుగు వేసింది. హైడ్రా అధికారిక వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ శుక్రవారం కొత్త పోర్టల్‌ను ప్రారంభించారు. హైడ్రా అందిస్తున్న సేవలు, కార్యకలాపాలు, అత్యవసర సహాయం, వాతావరణ పరిస్థితులు, చెరువులు, భూములు, అధికార పరిధి తదితర వివరాలను ఇక ప్రజలు ఒకే వేదికపై తెలుసుకునే అవకాశం కల్పించారు. పోర్టల్‌లో చెరువుల హద్దులు, కాలువల వివరాలు, ప్రభుత్వ భూములు, విపత్తు నిర్వహణకు సంబంధించిన సమాచారం అందుబాటులో ఉంటుంది. హైడ్రా చేపడుతున్న కార్యకలాపాలు, అధికారిక ప్రకటనలు, క్షేత్రస్థాయి కార్యక్రమాలు, చెరువుల పునరుద్ధరణ వివరాలను కూడా ప్రజలు తెలుసుకోవచ్చు. హైడ్రా 24 గంటల అత్యవసర హెల్ప్‌లైన్ 1070ను పోర్టల్‌లో ప్రత్యేకంగా అందుబాటులో ఉంచింది. చెట్లు కూలడం, అగ్ని ప్రమాదాలు, రహదారులపై నీరు నిలవడం, వరదలు, సహాయక చర్యలు లేదా ఇతర విపత్తు పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రజలు ఈ నంబర్‌కు సమాచారం అందించవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేందుకు ఇది ఉపయోగపడనుంది. ఫైర్ సేఫ్టీ ఎన్‌వోసీల కోసం కూడా పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సదుపాయం కల్పించారు. భవన యజమానులు, నిర్మాణదారులు దరఖాస్తు సమర్పించడంతోపాటు అది ఏ దశలో ఉందో తెలుసుకోవచ్చు. అధికారులు ప్రత్యేక డ్యాష్‌బోర్డు ద్వారా దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకునే వీలుంది. భారీ వర్షాలు, వరదల సమయంలో నీరు నిలిచే ప్రాంతాలను ముందుగానే గుర్తించేందుకు పోర్టల్‌లో ప్రత్యేక మ్యాప్‌లను అందుబాటులో ఉంచారు. జీహెచ్‌ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ పరిధిలోని వాటర్‌లాగింగ్, వరద ప్రభావిత ప్రాంతాలను వేర్వేరుగా పరిశీలించవచ్చు. దీంతో వర్షాల సమయంలో అప్రమత్తంగా ఉండాల్సిన ప్రాంతాలపై ప్రజలకు అవగాహన పెరగనుంది. పోర్టల్‌లో లైవ్ రైన్‌ఫాల్ మ్యాప్స్, రోజువారీ వర్షపాతం వివరాలు, వాతావరణ అంచనాలు, హైదరాబాద్ డాప్లర్ రాడార్ సమాచారం అందుబాటులో ఉంటుంది. ముఖ్యంగా భారీ వర్షాల సమయంలో తాజా పరిస్థితులను తెలుసుకోవడానికి ఈ సమాచారం ఉపయోగపడనుంది. హైడ్రా వెబ్‌సైట్ నుంచి హెచ్‌ఎండీఏ లేక్స్ పోర్టల్‌కు నేరుగా వెళ్లే అవకాశం కల్పించారు. చెరువులు, జలాశయాలకు సంబంధించిన ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ వివరాలను పరిశీలించవచ్చు. చెరువుల పరిసరాల్లో నిర్మాణాలు చేపట్టే ముందు వర్తించే నిబంధనలను తెలుసుకోవడానికి ఈ సమాచారం ఉపయోగపడుతుంది. తెలంగాణ ప్రభుత్వ భూ భారతి పోర్టల్‌కు కూడా హైడ్రా వెబ్‌సైట్‌లో నేరుగా లింక్ ఇచ్చారు. భూమి కొనుగోలు లేదా ఇతర లావాదేవీలకు ముందు సర్వే నంబర్, పట్టాదారు వివరాల ఆధారంగా అందుబాటులో ఉన్న భూ రికార్డులను పరిశీలించుకునే అవకాశం ఉంటుంది. హైడ్రా పునరుద్ధరించిన చెరువులు, చేపట్టిన పరిరక్షణ కార్యక్రమాలు, క్షేత్రస్థాయి పనులకు సంబంధించిన తాజా సమాచారాన్ని కూడా పోర్టల్‌లో పొందుపరిచారు. వార్తలు, ఫ్లాష్ న్యూస్, ఫొటోలు, వీడియోల ద్వారా హైడ్రా కార్యకలాపాలను ప్రజలు తెలుసుకోవచ్చు.